ప్రజాశక్తి
మంగళవారం 3 సెప్టెంబరు 2024
5
శ్రీకాకుళం



అభ్యంతరాల స్వీకరణకు గడువు పెంపు

శ్రీకాకుళం అర్బన్ : శ్రీకాకుళం పట్టణాభివృద్ధి సంస్థ గతంలో ప్రకటించిన డ్రాఫ్ట్ మాస్టర్‌ప్లాన్, డ్రాఫ్ట్ పర్‌ఫెక్టివ్ ప్లాన్, డ్రాఫ్ట్ జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్లకు సంబంధించి అభ్యంతరాల గడువును ఈనెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు సుడా విసి చల్లా ఓబులేసు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల గెజిట్‌ను ఆంధ్రప్రదేశ్ మెట్రోపాలిటన్ రీజియన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం అనుసరించి శ్రీకాకుళం జిల్లాలోని జి.సిగడాం, ఆమదాలవలస, నరసన్నపేట, పోలాకి, గార, శ్రీకాకుళం, లావేరు, పొందూరు, రణస్థలం, ఎచ్చెర్ల మండలాలతో పాటు శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఆమదాలవలస మున్సిపాల్టీ, విజయనగరం జిల్లాలోని రాజాం మండలం, మున్సిపాల్టీ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌కు సంబంధించి అభ్యంతరాలు, సూచనలను ఆ తేదీలోగా తెలియజేయాలని కోరారు.



ఆ రోడ్లకూ 'టోల్' తీస్తారా..?

- జిల్లాలో మూడు రోడ్లు జాతీయ రహదార్లుగా మార్పు?
- గత ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు
- 4పి విధానంలో రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిర్ణయం
- ప్రజల నుంచే డబ్బులు రాబట్టుకునేలా తెర పైకి కొత్త విధానం

కేంద్ర ప్రభుత్వ తరహాలోనే రహదారులను ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది. జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రోడ్లను అభివృద్ధి చేస్తామనే పేరుతో ప్రయివేట్ వ్యక్తులు, సంస్థలకు కట్టబెట్టాలని యోచిస్తోంది. నిధులు లేవని, రోడ్లు బాగు చేయడానికి ఇది తప్ప మరో మార్గం లేదంటూ ప్రజలకు సంకేతాలు ఇస్తోంది. రహదారులను ప్రయివేటుపరం చేసే పని గత వైసిపి ప్రభుత్వమూ కొంతమేర కానిచ్చింది. అందులో నరసన్నపేట-పాతపట్నం-పర్లాకిమిడి రహదారిని అదేవిధంగా పూర్తి చేయగలిగింది. మరికొన్ని రహదారులను అదే తరహాలో చేయాలని భావిస్తున్న సమయంలో అధికారం కోల్పోయింది. ఇప్పుడు ఆ పనిని టిడిపి కూటమి ప్రభుత్వం పూర్తి చేసేందుకు సిద్ధమవుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 1991.14 కిలోమీటర్ల పొడవున రహదారులు ఉన్నాయి. ఇందులో 674.95 కి.మీ రాష్ట్ర రహదారులు ఉండగా, 1040.54 కి.మీ మేర మేజర్ జిల్లా రహదారులు ఉన్నాయి. వీటితో ఇతర జిల్లాలను అనుసంధానం చేసే రాష్ట్ర రహదారులు 275.65 కి.మీ మేర ఉన్నాయి. వీటిలో కొన్ని రహదారులు అత్యంత దారుణంగా ఉన్నాయి. ఉదాహరణకు బత్తిలి-అలికాం రహదారి అడుగునా గుంతలమయంగా మారింది. ఆమదాలవలస నుంచి బూర్జ, కళింగపట్నం నుంచి శ్రీకాకుళం వరకు ఉన్న రహదారులు దారుణంగా ఉన్నాయి. అటు ఎచ్చెర్ల మండలం చిలకపాలెం నుంచి రాజాం వరకు ఉన్న రహదారి పరిస్థితి కూడా అలానే ఉంది. రోడ్ల మరమ్మతులకు ముఖ్యంగా గత ఐదేళ్లలో నిధులు కేటాయించకపోవడంతో తుపాన్లు, వర్షాలకు మరింత ఛిద్రమయ్యాయి. ఆ ధ్వంసమైన రోడ్లపైనే ప్రయాణాలు చేస్తూ ప్రజలు ప్రత్యక్ష నరకం చూశారు.


ఎన్‌హెచ్‌గా ప్రతిపాదించిన సిఎస్‌పి రహదారి

4పి విధానం ప్రజలపై బాదుడుకేనా?

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్లు బాగుపడతాయని అంతా ఆశించారు. అమరావతిలో పార్టీ నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల నిర్వహించిన సమావేశంలో రోడ్ల అభివృద్ధిపై చేసిన ప్రతిపాదన అందరినీ షాక్‌కు గురి చేసింది. రాష్ట్ర రహదారులను జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా 4పి (పబ్లిక్, ప్రయివేట్, పీపుల్ భాగస్వామ్యం) విధానంలో రహదారులను అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. నేషనల్ హైవేస్ (ఎన్‌హెచ్) రహదారులుగా అభివృద్ధి చేసిన తర్వాత జరగబోయేది ఏమిటో అందరికీ తెలిసిందే. ఇప్పటికే జిల్లాలో నరసన్నపేట-పాతపట్నం-పర్లాకిమిడి మార్గాన్ని ఎన్‌హెచ్‌గా మార్చి సారవకోట మండలం కిట్టాలపాడు వద్ద టోల్‌గేట్ ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి రుసుములు వసూలు చేస్తున్నారు.

జిల్లాలో ఉన్న ప్రధాన రాష్ట్ర రహదారులపై ఏదో ఒకచోట టోల్‌గేట్ ఏర్పాటు చేసి డబ్బులు వసూలు చేసే పనికి తెరతీయబోతున్నట్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటనల బట్టి తెలుస్తోంది. అభివృద్ధి అనే ముద్దు పేరుతో 4పి విధానంలో ప్రయివేట్ సంస్థలకు, వ్యక్తులకు అప్పగించే ఆలోచన చేస్తున్నట్లుగా కనిపిస్తోంది.

ఎన్‌హెచ్‌గా మూడు రహదారులకు ప్రతిపాదనలు

జిల్లాలో ఉన్న మూడు ప్రధాన రహదారులను జాతీయ రహదారులు (ఎన్‌హెచ్)గా మార్చాలనే నిర్ణయం గత వైసిపి ప్రభుత్వంలోనే జరిగింది. కళింగపట్నం-శ్రీకాకుళం-పార్వతీపురం (సిఎస్‌పి), బత్తిలి-అలికాం, చిలకపాలెం-రాజాం-సాలూరు రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు అనుమతించాలంటూ గత ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావడంలో జాప్యం కావడంతో అవి రూపుదిద్దుకోలేదు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో టిడిపి భాగస్వామ్యంగా ఉండడంతో అనుమతులు క్లియరెన్స్ అవుతాయని అంతా భావిస్తున్నారు వీటిని ఎన్‌హెచ్‌గా మారిన తర్వాత నిర్దిష్ట దూరంలో టోల్‌గేట్లు ఏర్పాటు చేయొచ్చని అధికారులు చెప్తున్నారు. గత ప్రభుత్వం మూడు రహదారులను ఎన్‌హెచ్‌గా మార్చాలని చూస్తే, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వం అన్ని రహదారులనూ జాతీయ రహదారుల ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని చెప్తోంది. మరి ఆ రహదారుల్లో టోల్‌గేట్‌లు ఏర్పాటు చేస్తారా? ఇతర ఏ రూపంలో పన్నులు వసూలు చేస్తారనేది విధివిధానాలు ఖరారయ్యే వరకు చూడాల్సి ఉంది.


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- 'మీకోసం'లో 132 వినతులు స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీకోసం)లో వచ్చిన అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీకోసంలో జిల్లావ్యాప్తంగా పలు సమస్యలపై 132 వినతులు వచ్చాయి. జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, జిల్లా పరిషత్ సిఇఒ వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ రామ్మోహనరావుతో కలిసి కలెక్టర్ వినతులు స్వీకరించారు. పూర్వీకుల నుంచి వచ్చిన ఆస్తిని అన్నదమ్ముల పంపకాల్లో తనకు వాటాగా వచ్చిన భూమి తన తమ్ముని పేరుతో అడంగల్ వస్తోందని, దీన్ని సరిచేయాలని సారవకోటకు చెందిన కె.చంద్రరావు వినతిపత్రం అందజేశారు. కొత్తూరు మండలం మాతలకు చెందిన స్వామిబాబు తన పూర్వీకుల నుంచి వచ్చిన భూమిని నదీపాతంగా చూపిస్తున్నారని, వాటిని సరిదిద్దాలని కోరారు. జలుమూరు మండలం నందూరుకు చెందిన ఎం.సుందరరావు తాను ఆర్మీలో పనిచేస్తున్నానని, తన భూమికి గ్రామానికి చెందిన వేరొక వ్యక్తి పేరుతో పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేశారని, వాటిని సరిదిద్ది పూర్తి హక్కులున్న తనకు కొత్తగా పట్టాదారు పాసుపుస్తకాలు అందజేయాలని కోరారు. వీటితో పాటు సలు వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతులు వచ్చాయి. పలు సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, పేదల ఇళ్ల పట్టాలు, పెన్షన్లు, సర్వే, ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితర సమస్యలపై వినతులు సమర్పించారు. వినతుల స్వీకరణ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. పెండింగ్, బియాండ్ ఎస్‌ఎల్‌ఎ, రీ ఓపెనింగ్ లేకుండా అర్జిదారుడు సంతప్తి చెందేలా అర్జీల పరిష్కార తీరు ఉండాలన్నారు. ప్రతి అర్జీని సంబంధిత ప్రధాన అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు.

ప్రకృతి వైపరీత్యాలపై ముందస్తు చర్యలు

జిల్లాలో వాయుగుండం తీరం దాటినా, ఇక్కడ ఆ స్థాయిలో వర్ష ప్రభావం లేదన్నారు. సరైన సమాచారం అందజేయకపోవడంతో చిన్నపాటి సమస్యలు ఉత్పన్నమయ్యాయన్నారు. రానున్న రోజుల్లో ఇటువంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రతిఒక్కరూ చేపట్టాల్సిన విధులు ముందుగా దిశా నిర్దేశం చేసుకునేందుకు తరచూ శిక్షణలు నిర్వహించాలని సూచించారు. కంట్రోల్‌రూమ్ నుంచి వెంట వెంటనే నివేదికలు సిద్ధం చేసేలా పూర్తిస్థాయి వ్యవస్థను సిద్ధం చేసుకోవాల్సి ఉందన్నారు. వరదలు, గాలులు సంభవించినప్పుడు రానున్న సమస్యలను ముందుగా గుర్తించి ముందస్తు చర్యల్లో భాగంగా చేపట్టాల్సిన సహాయక చర్యలపై నివేదికలు తయారు చేసుకోవాలన్నారు. అనంతరం జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కెఆర్‌సి ప్రత్యేక ఉప కలెక్టర్ సుదర్శనదొర, జెడ్‌పి డిప్యూటీ సిఇఒ వెంకటేశ్వరరావు, డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి, డిసిహెచ్ఎస్ రాజ్యలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ఇ రాంబాబు, జిల్లా ఉద్యాన అధికారి ఆర్.వి ప్రసాదరావు, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఆర్‌ఒ అప్పారావు

వినాయక ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి అనుమతులు తప్పక తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.అప్పారావు స్పష్టం చేశారు. తన ఛాంబరులో సంబంధిత శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక చవితి ఉత్సవాలకు అనుమతులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండో విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని తెలిపారు. ఇందులో భాగంగా 7995095800 మొబైల్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా Hi అని సందేశం పంపిస్తే, నిరభ్యంతర పత్రం కోసం అనుసరించాల్సిన ప్రక్రియ మొత్తం వాట్సాప్‌కు వస్తుందని పేర్కొన్నారు. తర్వాత https://ganeshutsav.net వెబ్‌సైట్‌లో వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మండపాల ఏర్పాటు నియమాలకు అనుగుణంగా ఉంటే మీసేవలో చలానా కట్టి https://ganeshutsav.net/applicationStatus, ఫోన్ నంబరును నమోదు చేస్తే నిరభ్యంతర పత్రం, నిబంధనలతో కూడిన క్యూఆర్ కోడ్ డౌన్‌లోడ్ అవుతుందని వివరించారు. శ్రీకాకుళం నగర పరిధిలో నిమజ్జనం చేసేందుకు పొన్నాడ, ఏడు రోడ్ల కూడలి, డేఅండ్‌నైట్ కూడలి వంతెనలు, పెద్దపాడు చెరువును గుర్తించామన్నారు. రాత్రి పది గంటల్లోపు నిమజ్జనం ముగించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, డిఎస్‌పి వివేకానంద, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పి 'మీకోసం'కు 41 అర్జీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పలు సమస్యలపై 41 అర్జీలు వచ్చాయి. సివిల్ అంశాలపై 15, ఆస్తి నేరాలపై 2, మోసాలపై 3, కుటుంబ తగాదాలపై 5, పాత ఫిర్యాదులపై 6, ఇతరత్రా అంశాలపై 10 ఫిర్యాదులను ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి స్వీకరించారు. ఫిర్యాదుదారులు సమస్యలను ఎస్‌పికి విన్నవించుకోగా, ఆయన సానుకూలంగా స్పందించి సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని ఆదేశించారు. బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మీకోసం ఫిర్యాదులపై తీసుకున్న చర్యలపై నిర్ణీత సమయంలో నివేదికను అందించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం డిఎస్‌పి వివేకానంద పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్సుల తనిఖీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలోని దుకాణాల్లో ట్రేడ్ లైసెన్సులను ప్రజారోగ్య అధికారి డాక్టర్ పి.సుధీర్ కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ట్రేడ్ లైసెన్స్ పొందకుండా వ్యాపారం నడుపుతున్న దుకాణాల్లో తనిఖీ చేసిన ఆయన, మూడు రోజుల్లో ట్రేడ్ లైసెన్సులు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు. లేకుంటే దుకాణదారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల ప్రకారం వ్యాపారులు తమ కార్యకలాపాలు నిర్వహించుకోవాలని సూచించారు.

ఉద్దానం కిడ్నీ వ్యాధులపై పరిశోధన

కొలంబియా యూనివర్శిటీ పర్యావరణ శాస్త్రవేత్త లెక్స్వేనేన్

ప్రజాశక్తి - పలాస

ఉద్దానం గ్రామాల్లో కిడ్నీ వ్యాధి విస్తృతికి గల కారణాలపై పరిశోధన చేయనున్నట్లు కొలంబియా యూనివర్శిటీ పర్యావరణ శాస్త్రవేత్త లెక్స్వేనేన్ తెలిపారు. మండలంలోని కిడ్నీ పరిశోధనా కేంద్రం, 200 పడకల ఆస్పత్రికి సోమవారం చేరుకున్న ఆయన కిడ్నీ వ్యాధులపై అధ్యయనం చేస్తున్న ది గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ సిబ్బందికి ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉద్దానం కిడ్నీ వ్యాధులకు ఈకోలై బ్యాక్టీరియా కూడా కారకమన్న సందేహాలు ఉన్నాయని చెప్పారు. ఇందుకు సంబంధించి పరిశోధనలు చేయడానికి నమూనాలు సేకరించనున్నట్లు తెలిపారు. స్థానిక కిడ్నీ పరిశోధనా కేంద్రంలో చేయాల్సిన పరీక్షలు నిర్వహించడంతో పాటు ఇక్కడ సాధ్యం కాని వాటి నమూనాలు అమెరికా తరలించి సూక్ష్మస్థాయి పరీక్షలను చేస్తామని చెప్పారు. మొత్తం వ్యాధి నిర్ధారణ పరీక్షలు పూర్తి చేయడానికి మరో రెండున్నరేళ్లు పడుతుందని గ్లోబల్ ఇన్‌స్టిట్యూట్ వైద్యాధికారి డాక్టర్ జి.బాలాజీ తెలిపారు. ఉద్దానం ప్రాంతంలో ఎంపిక చేసిన గ్రామాల్లో మట్టి, ధూళి, నీరు, ఫ్లోరైడ్, ఐరన్ వంటి కారకాలపై పరీక్షలను ఈనెల మూడో తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు.


శిక్షణ ఇస్తున్న శాస్త్రవేత్త లెక్స్వేనేన్

రాష్ట్రంలో అసమర్థ పాలన

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అసమర్థ పాలన సాగిస్తోందని మాజీ మంత్రి, వైసిపి నాయకులు సీదిరి అప్పలరాజు విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కీ.శే వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా కాశీబుగ్గ సంత మైదానం వద్ద ఆయన విగ్రహానికి వైసిపి నాయకులతో కలిసి సోమవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో తెలుగు రాష్ట్రాల ప్రజల హృదయాల్లో రాజశేఖర్ రెడ్డి చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్నారన్నారు. పేదవాడి జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తి ఎవరైనా ఉన్నారంటే అది వైఎస్ఆర్ అని కొనియాడారు. వైద్యరంగానికి ప్రాధాన్యమిచ్చి వైద్య కళాశాలలు ఏర్పాటు చేశారని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఆ కళాశాలలకు ఆయన పేరును తొలగించినా, ప్రజల హృదయాల నుంచి మాత్రం తొలగించలేరన్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రాష్ట్రంలో తుపాన్లు, వరదలు వచ్చిన వెంటనే అన్ని శాఖల అధికారులు, మంత్రులతో తక్షణమే సమావేశాలు నిర్వహించి నష్ట నివారణ ప్రణాళికలు రూపొందించేవారని తెలిపారు. విజయవాడ వరదల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులు, మంత్రులతో సమీక్షలు చేయకుండా, రాత్రిపూట అధికారులతో కలిసి వీధుల్లో తిరుగుతున్నారని చెప్పారు. ఆయనతో అధికారులను తిప్పించుకుంటే, వారు ప్రజలకు ఏం చేయగలరని ప్రశ్నించారు. కరకట్ట మీద ఉన్న చంద్రబాబు ఇంటికి నీరు పోకుండా రక్షించుకోవడానికే విజయవాడలోని ప్రాంతాన్నంతా నీటిమయం చేశారని ఆరోపించారు. చంద్రబాబు ఇల్లు మునిగిపోతుందని అధికారులు ఇంటికి పంపించకుండా బస్సులో ఉండాలని సూచించారని, ఆ బస్సులో ఉండి ప్రజలకు సేవలు చేస్తున్నట్లు బూటకపు మాటలు చెప్తున్నారని విమర్శించారు. సినీ నటి వివాద కేసులో వైసిపి నాయకులను ఇరికించేందుకు చూపిస్తున్న శ్రద్ధ వరదలపై లేదన్నారు. కార్యక్రమంలో పలాస-కాశీబుగ్గ మున్సిపల్ వైస్ చైర్మన్లు బోర బుజ్జి, సురేష్‌బాబు, కౌన్సిలర్లు గుజ్జు జోగారావు, సవర సోమేశ్వరరావు, వైసిపి నాయకులు పి.వి సతీష్, పైల చిట్టి, ఉంగ సాయి తదితరులు పాల్గొన్నారు.


వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పిస్తున్న అప్పలరాజు

అభివృద్ధికి మూఢనమ్మకాలు ఆటంకం

ప్రజాశక్తి - నరసన్నపేట

అభివృద్ధికి మూఢనమ్మకాలు ఆటంకమని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ అన్నారు. స్థానిక కామేశ్వరి కాంప్లెక్స్ ఆవరణలో జనవిజ్ఞాన వేదిక ప్రాంతీయ సమావేశాన్ని జెవివి జిల్లా కార్యదర్శి ఆర్.సురేష్‌బాబు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశాస్త్రీయ భావనలు, మూఢనమ్మకాలు పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో జన విజ్ఞాన వేదిక వంటి ప్రజా సైన్స్ ఉద్యమాల ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈనెల 14 15 తేదీల్లో అనంతపురంలో నిర్వహించే జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర వార్షిక సమావేశాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం రాష్ట్ర గౌరవాధ్యక్షులు సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగించి రోడ్ల మీద పారవేయడం వల్ల మూగజీవాలు వాటిని తిని అనారోగ్యాల పాలై మృతి చెందుతున్నాయన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. మూఢనమ్మకాల నిరోధక చట్ట సాధన కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు బమ్మిడి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాలను విజ్ఞానం, చైతన్యం కల్పించడం ద్వారా పారదోలవచ్చన్నారు. సోషల్ స్టడీస్ ఫోరం జిల్లా అధ్యక్షులు బాడాన రాజు మాట్లాడుతూ చెకుముకి సైన్సు సంబరాల విజయానికి తమవంతు కృషి చేస్తామన్నారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కోరాడ వైకుంఠరావు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ద్వారా శాస్త్రీయ దృక్పథ ప్రచారాన్ని విస్తృతం చేయాల్సిన అవసరముందన్నారు. జీవ శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం మండల అధ్యక్షులు దంత లక్ష్మణరావు మాట్లాడుతూ సమాజ పురోగమనంలో సైన్స్ పాత్ర ముఖ్యమైందన్నారు. చెకుముకి సైన్స్ సంబరాలు పోలాకి మండల కన్వీనర్ ఉప్పాడ వాసుదేవరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథాన్ని పెంచేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు దోహదపడతాయని, విద్యార్థులు ఇందులో భాగస్వామ్యం కావాలన్నారు. ఈనెల చివరి వారంలో నరసన్నపేటలో జన విజ్ఞాన వేదిక జిల్లాస్థాయి శాస్త్రీయ దృక్పథ సదస్సు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో జెవివి నాయకులు ఎన్ని రవికుమార్ కె.రాజారావు, ఎం.రమణ, డి.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న గిరిధర్


ఘనంగా పవన్‌కళ్యాణ్ జన్మదినం



బూర్జ : రక్తదాతకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్



ఇచ్ఛాపురం : గాజు గ్లాస్ నమూనాను ప్రారంభిస్తున్న రాజు



ఆమదాలవలస : రక్తదానం చేస్తున్న రామ్మోహనరావు

ప్రజాశక్తి- బూర్జ

సేవామార్గమే అనుసరణీయమని నిస్వార్థమైన సేవ ఉన్నత శిఖరాలను ఎక్కిస్తుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని కొల్లివలసలో జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల సందర్భంగా జనసేన ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. శ్రీకాకుళం న్యూబ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 72 మంది జనసైనికులు రక్తదానం చేశారు. అనంతరం డొక్కా సీతమ్మ పేరుతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రక్తదాతలకు ఎమ్మెల్యే ప్రశంసాపత్రాలను అందజేశారు.

కవిటి: ఒక వ్యక్తిచేసే రక్తదానం మరొవ్యక్తికి ప్రాణదానం చేస్తుందని ఎమ్మెల్యే బెందాళం అశోక్, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి దాసరి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి లోల్ల రాజేష్ అన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని మండలంలోని జగతిలో జనసేన నాయకుడు, విశ్రాంత డిఎస్‌పి ఎస్.వి.వి.ప్రసాదరావు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అలాగే జనసేన స్థూపం ఏర్పాటు చేసి రాజు చేతుల మీదుగా పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం మొక్కలు నాటారు. పలు స్వచ్ఛంద సంస్థల సభ్యులు, జన సైనికులు పాల్గొన్న రక్తదాన శిబిరంలో 42 మంది రక్తదానం చేశారు.

మెళియాపుట్టి : మండలంలోని వసుంధరలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ఎమ్మెల్యే గోవిందరావుకు కుమారుడు మామిడి సాయిగణేష్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అలాగే గ్రామంలో మొక్కలను నాటారు.

రణస్థలం రూరల్: పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా మండల కేంద్రం రామతీర్థాలు కూడలి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పాల్గొని కేకు కట్ చేశారు. అలాగే దేరసాంలో నిర్వహించిన వేడుకల్లో హాజరై వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి విశ్వక్సేన్, జనసేన మండల అధ్యక్షులు బస్వ గోవిందరెడ్డి, వీర మహిళ గుగ్గిళపు స్వప్న పాల్గొన్నారు

నరసన్నపేట : మండలంలోని యారబాడులో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో భాగంగా సచివాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి బలగ ప్రవీణ్‌కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి యోగ హరి, తడేల సత్య పాల్గొన్నారు.

పోలాకి : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా ఎంపిడిఒ కార్యాలయ ఆవరణంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మొక్కలను నాటారు.

కోటబొమ్మాళి: కోటబొమ్మాళిలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్లో జనసేన మండల అధ్యక్షులు అనిల్‌కుమార్, జిల్లా కార్యదర్శి పల్లి కోటేశ్వరరావులు పాల్గొని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అలాగే స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో, సచివాలయం దగ్గర మొక్కలు నాటారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పవన్‌కళ్యాణ్ జన్మదినం పురస్కరించుకొని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమంలు నిర్వహించారు. మున్సిపాలిటీ ఆరో వార్డులో శ్యామ్ ఆధ్వర్యాన, పదో వార్డులో రోకళ్ల భాస్కరరావు ఆధ్వర్యాన పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కత్తివరంలో పంచాయతీ ఇన్‌ఛార్జి దుర్గశి వంశి ఆధ్వర్యాన ప్రభుత్వ స్కూల్‌లో నిర్మించిన వంట గది ప్రారంభించారు. కేదారిపురం, ఈదుపురంలో వైద్య శిబిరాలు నిర్వహించారు. అలాగే గాజు గ్లాస్ నమూనాను ప్రారంభించారు. అనంతరం మొక్కలను నాటారు. కార్యక్రమంలో వివేక్ బాబు, తిప్పిన దుర్యోధనరెడ్డి, బైపల్లి, ఈశ్వరరావు, నాగుల హరి బెహరా, దొక్కర ఈశ్వరరావు, నీలవేణిరెడ్డి పాల్గొన్నారు.

నౌపడ : ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ పుట్టిన రోజు సందర్భంగా సంతబొమ్మాళి మండలం నౌపడ ప్రభుత్వ బిసి హాస్టల్ విద్యార్థులకు జనసేన నాయకులు కంబాల కూర్మారావు, రాజేష్, హరికృష్ణ పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు.

మందస : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు స్థానిక బస్టాండ్ కూడలిలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్‌పండా కేక్‌ను కట్ చేశారు. అనంతరం డొక్కా సీతమ్మ పేరు మీద అన్నదానం నిర్వహించారు.

సోంపేట : పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను మండలంలోని చిన్నమామిడిపల్లిలో జనసేన నాయకులు బచ్చల గిరిబాబు కేక్ కట్ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో త్రినాథ్, సారథి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కొర్లంలో పెద్దింటి చందు, ఇసుకలపాలెంలో రాష్ట్ర జాయింట్ సెక్రటరీ బైపల్లి ఈశ్వరరావు ఆధ్వర్యాన జన్మదిన వేడుకలు నిర్వహించారు.

టెక్కలి : పవన్‌కళ్యాణ జన్మదిన వేడుకలను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం నిర్వహించారు. 90 మంది రక్తదానం చేశారు.

జి.సిగడాం: మండలంలోని గేదెలపేట, జి.సిగడాం గ్రామాల్లో పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలకు ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గేదెలపేటలో కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న వారికి రూ.13 వేలు అందజేశారు. ఈ సందర్భంగా జి.సిగడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బిసి బాలుర వసతి గృహంలో కూటమి జనరల్ సెక్రెటరీ శివ శంకర్, జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్, ఎచ్చెర్ల జనసేన సమన్వయకర్త విశ్వక్సేన్, నాయకులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు.

ఆమదాలవలస: పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో 70 మంది రక్తదానం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పేడాడ రామ్మోహన్‌రావు, జనసేన జిల్లా ఉపాధ్యక్షులు పాత్రుని పాపారావు, జనసేన నాయకులు ఎలకల రమణ, పైడి మురళీమోహన్, శిర్లాపు గణేష్, పొట్నూరు ప్రసాద్ పాల్గొన్నారు.

పొందూరు: పట్టణంలో పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు నియోజకవర్గం ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి కొంచాడ చిన్నంనాయుడు, మండలం అధ్యక్షుడు యలకల రమణ, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మి, నాయకులు బాబూరావు, శివ, గోవింద్, గణేష్, రాంబాబు, జనసైనికులు పాల్గొన్నారు.

రణస్థలం: డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా కొండములగాం ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటి, రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దాసరి బలరాం, రాజు, స్వప్న, మహిళలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సందర్భంగా ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో సిక్కోలు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈశిబిరంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, ప్రముఖ వైద్యులు దానేటి శ్రీధర్, ఎమ్మెల్యే సతీమణి గొండు స్వాతి శంకర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ చేసి అభిమానులకు తినిపించారు. 60 మంది యువకులు రక్తదానం చేశారు.



కవిటి : రక్తదానం చేస్తున్న రాజేష్



లావేరు : కేక్‌ను కట్ చేస్తున్న విశ్వక్సేన్, తేజబాబు



కోటబొమ్మాళి : రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న నాయకులు

లావేరు: మండల కేంద్రం లావేరులో పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఈశ్వరరావు కుమారుడు తేజబాబు, ఎచ్చెర్ల జనసేన ఇన్‌ఛార్జి విశ్వక్సేన్ పాల్గొని కేకు కట్ చేశారు. అనంతరం వృద్ధులు, రోగులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, జనసేన నాయకులు కోలా రాజేష్, లంకలపల్లి బాబు, శివప్రసాద్, గండి సురేష్, జనపాల గోవిందరావు, నాయకులు పాల్గొన్నారు.




కేక్ కట్ చేస్తున్న సిబ్బంది

ఎల్ఐసి వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేటలో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా 68వ వార్షికోత్సవం బ్రాంచ్ మేనేజర్ ఎం.నేతాజీ అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. నరసన్నపేట, పోలాకి మండల డిలిలు పి.శ్రీనివాసరావు, శరత్ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఎల్ఐసి ప్రాముఖ్యత, వాటి చరిత్ర, వాటి ఉపయోగాలు వివరించారు. అనంతరం సందర్భంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఎపి, తెలంగాణా, కర్నాటక తదితర రాష్ట్రాల్లో వెయ్యి పాలసీలు పూర్తి చేసిన డెవలప్‌మెంట్ అధికారులు బి.పార్థసారథి, మేనేజర్ నేతాజీలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆర్.సురేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



అవగహన కల్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

లోతట్టు ప్రాంతాల్లో పర్యటన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విపత్కర పరిస్థితుల్లో లయన్స్‌క్లబ్ సెంట్రల్ అండగా ఉంటుందని లయన్స్ క్లబ్ సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్ తెలిపారు. సోమవారం మండలం గనగళ్లవానిపేటలో లోతట్టు ప్రాంతాలను లయన్స్‌క్లబ్ సెంట్రల్ సభ్యులు పరిశీలించారు. అక్కడ నివాస ముంటున్న మత్స్యకారులకు తగిన జాగ్రత్తలను వివరించి సముద్రంలోకి చేపల వేటకు వెళ్ల వద్దని సూచించారు. గ్రామస్థులకు మందులు, పాలు, బిస్కెట్లు, అరటిపండ్లును అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శికి దేహశుద్ధి



దేహశుద్ధి చేస్తున్న గ్రామస్తులు

పలాస : వజ్రపుకొత్తూరు మండలంలోని అనంతగిరి పంచాయతీ కార్యదర్శి హుస్సేన్‌కు పలాస మండలం వీరభద్రాపురం గ్రామస్తులు దేహశుద్ధి చేసిన ఘటనా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే... అనంతగిరి సచివాలయంలో హుస్సేన్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. అదే సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగినితో తరచూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఈ విషయాన్ని తమ బంధువు పలాస మండలం వీరభద్రాపురంలో నివాసం ఉంటున్న వెంకటరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విషయం తెలుసుకున్న కార్యదర్శి హుస్సేన్ మద్యం సేవించి వెంకటరావు ఇంటికి వెళ్లి హల్‌చల్ చేయడంతో గ్రామస్తులు దేహశుద్ధి చేశారు. ఇదే విషయంపై వజ్రపుకొత్తూరు ఎంపిడిఒ ఈశ్వరమ్మను వివరణ కోరగా, హుస్సేన్ ఘటనాపై ఛార్జీ మెమో జారీ చేసినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే రమణమూర్తి అభినందనలు

నరసన్నపేట : కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి సోషల్ మీడియా వేదికగా పార్టీ ఇచ్చిన సమాచారాన్ని ప్రజలకు అందించడంలో కత్తిరి వెంకటరమణ, ఇట్రాజు సంతోష్, గొల్లంగి గణేష్, బొమ్మాళి బలరాం, లంక రామారావు, గదిలి జగదీష్, లట్టి శ్రీనివాసరావు, పాగోటి సింహాచలం కృషి చేశారని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం అభినందిస్తూ... ప్రశంసాపత్రాలను అందజేశారు. టిడిపి నాయకులు ఎం.వెంకట అప్పలనాయుడు, గొద్దు చిట్టిబాబు, కత్తిరి వెంకటరమణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'నలంద' యాజమాన్యానికి సత్కారం



సత్కారాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయులు

మెళియాపుట్టి : అంధత్వ నివారణకు విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ సంస్థ జిల్లాలో అనేక ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించింది. దీనిలో భాగంగా మండలంలోని నలంద పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జె.జె.ఎస్.ప్రతాప్ అనేకసార్లు నేత్ర వైద్య శిబిరాల నిర్వహనకు సహకరించారు. శంకర్ ఫౌండేషన్ 92 వసంతాలు సందర్భంగా సోమవారం విశాఖలో పలువురునిరి సన్మానించారు. నలంద స్కూల్ యాజమాన్యం తరుపున ఉపాధ్యాయులు పి.శారద, ఎం.నీలిమ సత్కారాన్ని సోమవారం స్వీకరించారు.

లంబోధర తగ్గేదేలే!

విగ్రహాలకు పెరిగిన డిమాండ్



ప్రజాశక్తి- కోటబొమ్మాళి

గణపతి బప్పా మోరియా అంటూ సాగే ఉత్సవాలకు ఇంకా ఐదు రోజులు మాత్రమే ఉంది. దీంతో ఉత్సవాల ఏర్పాట్లలో అందరూ నిమగ్నమయ్యారు. వినాయక విగ్రహాల ధరలు ఈ యేడాది అధికంగా పలుకుతున్నాయి. వీటి తయారీకి వినియోగించే ముడిసరకు, అలంకరణ సామగ్రి ధరలు గతంలో కంటే 50 శాతం మేరకు పెరిగాయి. వేరే ప్రాంతాల సామగ్రిని తెచ్చేందుకు రవాణా ఛార్జీలు, కూలీల రేట్లు అధికమయ్యాయి. వీటన్నింటి ప్రభావం విగ్రహాలపైనా పడుతోంది. ఎక్కువ మంది, 10, 12, 14 అడుగుల ఎత్తు విగ్రహాలను కొనుగోలు చేస్తుంటారు. 10 అడుగుల విగ్రహాల ధర గతంతో రూ.10 వేలు ఉండగా, ఇప్పుడు రూ.16 వేలు వరకు ఉంది. ఎత్తు, అలంకరణను బట్టి ధరలు ఉంటున్నాయి. ప్రస్తుతం ఈ వినాయక చవితికి 8 నెలలకు ముందే పనులు ప్రారంభించాం. ఈ సారి విగ్రహాలకు డిమాండు బాగుందని కోటబొమ్మాళితో విగ్రహాలను తయారీదారు కాశీనాద్ తెలిపారు. వీధుల్లో మండపాల ఏర్పాటు ఖర్చులు తడిపి మోపెడవుతున్నాయి. 10 అడుగుల వెడల్పు 20 అడుగుల పొడవుతో మండపానికి అయ్యే ఖర్చు రూ.20 వేలకు పైమాటేనని, విద్యుద్దీపాలంకరణ, స్టేజి ఇతర పరికరాలకు అదనంగా వెచ్చించాల్సిందే. దీనికితోడు తాత్కాలిక విద్యుత్ సరఫరా, ఇతర అనుమతులకు నిర్ణీత రుసుములు చెల్లించాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు.

న్యాయం చేయరూ...

ప్రజాశక్తి- సోంపేట

తాము సాగు చేసుకుంటున్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి న్యాయం చేయాలని కొర్లాం, పాలవలస, లక్కవరం, పలాసపురం తదితర పంచాయతీలకు చెందిన రైతులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ అప్పలస్వామిని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సర్వే నంబరు 90 నుంచి 110 నంబరు వరకు ఉన్న భూములు ఆన్‌లైన్‌లో వివరాలు కనిపించడం లేదని, దీనివల్ల తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అడంగల్‌లు లభించక, 1బి రాక, ఈ-క్రాప్ నమోదు కావడం లేదని అన్నారు. దీంతో ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, సహాయం అందడం లేదని వాపోయారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఆమదాలవలస: సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తొగరాం పిహెచ్‌సి వైద్యులు మెట్ట స్రవంతి అన్నారు. సోమవారం పిహెచ్‌సి పరిధిలో పలు గ్రామాల్లో జ్వర బాధితులను గుర్తించేందుకు సిబ్బందితో కలిసి ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు విస్తారంగా కురవడంతో పాటు వాతావరణంలో మార్పులతో సీజనల్ జ్వరాలు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశానుసారం జ్వర బాధితులను గుర్తించేందుకు ఇంటింట సర్వే చేపట్టామని, సర్వేలో జ్వర బాధితులను గుర్తించి మందులను పంపిణీ చేస్తామని తెలిపారు. ఎవరైనా జ్వర బాధితులు ఉంటే ఆస్పత్రిలో రక్త పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మల్లిబాబు, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

మెళియాపుట్టి : మండలంలోని శేఖరాపురం సమీపంలోని బస్టాండ్ వద్ద సోమవారం ఆరుగురు జూదర్లను అరెస్టు చేశామని ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు. కొద్ది రోజులుగా పట్టుపురానికి చెందిన వ్యక్తులు పేకాట ఆడుతున్నారని అన్నారు. స్థానికుల సమాచారం మేరకు సిబ్బంది దాడులు నిర్వహించామని తెలిపారు. ఆరుగురు వ్యక్తులతో పాటు వారి వద్ద నుంచి రూ.9,710 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

పోలీస్‌స్టేషన్ తరలింపునకు ప్రతిపాదనలు

బూర్జ : బూర్జ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ తరలింపునకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని కొల్లివలసలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న అనంతరం స్పష్టం చేశారు. మండల ప్రజల అభీష్టం మేరకు పోలీస్‌స్టేషన్‌ను మదనాపురం గ్రామ జంక్షన్ వద్ద ఉన్న రైతుసేవా నూతన భవనంలోకి మార్చేందుకు పోలీసు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. మండల కేంద్రంలోనున్న పోలీస్‌స్టేషన్ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో పోలీసులు బిక్కుబిక్కుమంటూ సేవలను అందిస్తున్నారని వారికే రక్షణ కరువైందని తెలిపారు. ఈ నూతన భవనంలో పోలీస్‌స్టేషన్ మార్పు జరగడం వలన పోలీసులు సక్రమమైన సేవలను అందించేందుకు అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.



పరిశీలిస్తున్న తులసీవరప్రసాదరావు

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ కళాశాల రహదారిలో మురుగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మండల పరిషత్ ఉపాధ్యక్షులు లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు హామీనిచ్చారు. ఈ మేరకు సోమవారం మురుగునీటిని పరిశీలించారు. మురుగునీటి సమస్యను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్ ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సూచనల మేరకు ఆయన పరిశీలించారు. ఈయన వెంట ఆర్అండ్‌బి డిఇ ఎం.ఎల్.వి.సాగర్, జెఇ టి.కిరణ్‌కుమార్, లోతుగెడ్డ తాతబాబు, ఎన్.అప్పన్న, పి.వెంకటకృష్ణ, బి.గోవింద్, కె.శ్రీను, ఎస్.హరి, ఎల్.వెంకి, రామానుజలు ఉన్నారు.

జన హృదయ నేత వైఎస్ఆర్



ఇచ్ఛాపురం : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న విజయ, తదితరులు

కవిటి : జనహృదయనేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి అని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. వైఎస్ఆర్ వర్ధంతిని పురస్కరించుకుని బస్టాండ్ కూడలిలోని ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, క్రి గోపయ్య, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పోలాకి : మండంలోని ఈదులవలస, సుసరం, పిన్నింటిపేటల్లోని వైఎస్ఆర్ విగ్రహాలకు వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి ముద్దాడ భైరాగినాయుడు, డిసిసిబి మాజీ చైర్మన్ కర్మి రాజేశ్వరరావు, ఎఎంసి మాజీ చైర్మన్ దుంపల భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షులు కణితి కృష్ణారావు, జెసిఎస్ కన్వీనర్ కణితి సత్తిబాబు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్ఆర్ విగ్రహాలకు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఇందులో భాగంగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, వైస్ చైర్మన్ ఉలాల భారతీ దివ్య, ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, వైస్ ఎంపిపిలు సవర ఆదినాయుడు, పాడి అప్పారావు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ కళాశాల సమీపంలోని వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గోగుల వరప్రసాదరావునాయుడు, చింతాడ సూర్యనారాయణ, వి.లక్ష్మీనారాయణ, పి.రామారావు నాయుడు పాల్గొన్నారు.

టెక్కిలి రూరల్ : ఇందిగాగాంధీ కూడలి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే జిల్లా ఆస్పత్రిలో రోగులకు దుప్పట్లు, పళ్లు పంపిణీ చేశారు. ఎంపిపిలు నడుపూరు శ్రీరామ్మూర్తి, రోణంకి ఉమామహేశ్వర రావు, ఎ.రామారావు, సంపతరావు హేమసుందరరావు, జోగి రాములమ్మ, పీత హేమలత పాల్గొన్నారు.

నందిగాం: స్థానిక మండల కాంప్లెక్స్ ఆవరణలోని వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఎర్ర చక్రవర్తి, మండల పార్టీ అధ్యక్షులు తమిరి ఫల్గుణరావు, జెసిఎస్ మండల కన్వీనర్ జడ్యాడ జయరాం, మండల ప్రత్యేకాహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, వైస్ ఎంపిపి లక్ష్మీకాంతం, ఎంపిటిసి అంబోడి విష్ణు పాల్గొన్నారు.

మందస : మండలంలోని బేతాలపురంలో వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి డొక్కరి దానయ్య పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సౌర డిల్లీశ్వరరావు, టి.దామోదర్, గుంటు పార్వతి, లింగరాజు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: స్థానిక వైఎస్ఆర్ విగ్రహాలకు ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అన్నెపు రామారావు, సంపతిరావు హేమసుందరరాజు, నూక సత్యరాజు, దుక్క రామకృష్ణ పాల్గొన్నారు.

టెక్కలి : పట్టణంలోని వైఎస్ఆర్ విగ్రహానికి డిసిసి అధ్యక్షులు పేడాడ పరమేశ్వరరావు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ కిల్లి రామ్మోహనరావు, కోత మధుసూదనరావు, పొట్నూరు ఆనందరావు, శాసుమహంతి ధర్మారావు, దాట్ల లింగమూర్తి పాల్గొన్నారు.

అలాగే మండలంలోని బొప్పాయిపురం పంచాయతీ కార్యాలయం ఆవరణలో సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డి, శ్యాంసుందరాపురంలో పొట్నూరు భూలక్ష్మి, అప్పలనాయుడు, పరశురాంపురంలో సర్పంచ్ కె.కామేశ్వరరావు, పాతనౌపడలో సర్పంచ్ దల్లి లోకేశ్వరరెడ్డి, నర్సింగపల్లిలో సర్పంచ్ రౌతు జయమోహన్ ఆధ్వర్యాన వైఎస్ఆర్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు.

సోంపేట : స్థానిక బస్టాండ్ కూడలి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, ఎంపిపి ఎన్.దాస్‌లు పూలమాలలు వేసి నివాల్లర్పించారు. తడక జోగారావు, ఎస్.భాస్కరరావు, బి.శ్రీకృష్ణ, ఆర్.విశ్వనాథం, వై.రజని, టి.పద్మావతి, పి.గున్నయ్య, ఎం.ధనంజయం, కె.శ్రీనివాస్, జె.ఉదయ్, కె.నెహ్రు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మండల కేంద్రంలోని వైఎస్ఆర్ విగ్రహానికి ఎఎంసి మాజీ చైర్మన్ కెల్లి జగన్నాయకులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు, వైస్ ఎంపిపి ప్రతినిధులు నక్క భీమారావు, పి.రామకృష్ణ, మండల అధ్యక్షులు కోత సతీష్, వైసిపి మహిళా అధ్యక్షులు జోగి రాములమ్మ పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర ప్రజల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న ప్రజానాయకుడు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకుని నగరంలోని ఏడురోడ్ల జంక్షన్ వద్ద ఆయన విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎంవి పద్మావతి, పార్టీ నాయకులు అందవరపు సూరిబాబు, కోణార్క్ శ్రీను, అంబటి శ్రీనివాసరావు, మామిడి శ్రీకాంత్, శిమ్మ రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ ఆధ్వర్యాన

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ ఆధ్వర్యాన ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి సనపల అన్నాజీరావు, కాంగ్రెస్ నాయకులు అంబటి కృష్ణారావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు డి.గోవింద, మల్లిబాబు, గార మండల కాంగ్రెస్ అధ్యక్షులు అంబటి దాలినాయుడు, రమేష్ కుమార్, రవికుమార్, జిపి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: ప్రజల మధ్యలో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్ఆర్ అని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. సోమవారం వైఎస్ఆర్ 15వ వర్ధంతి సందర్భంగా పట్టణ శివారులో ఉన్న ఫ్లైఓవర్ దిగువన వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరిపాలన దక్షకుడిగా ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిన మహానేత వైఎస్ఆర్ అని కొనియాడారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కోట గోవిందరావు, మామిడి ప్రభాకరరావు, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పొడుగు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సంతబొమ్మాళి : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జగన్నాయకులు



పొందూరు : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



ఆమదాలవలస : విగ్రహానికి పూలమాలు వేస్తున్న సీతారాం



నరసన్నపేట : విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న కృష్ణదాస్

రణస్థలం: వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పూలమాలలు వేసి ఘన నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మండల ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్‌పిటిసి టొంపల సీతారాం, మండల పార్టీ అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి చిల్ల వెంకటరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లంకలపల్లి ప్రసాద్, వైస్ ఎంపిపి ప్రతినిధి మైలపల్లి కామరాజు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు రెడ్డి విశ్వేశరావు, ఎంపిటిసిల సంఘం అధ్యక్షులు మహంతి చిన్న రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: పొందూరు అంబేద్కర్ కూడలిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, పిఎసిఎస్ మాజీ ఛైర్మెన్ కొంచాడ రమణమూర్తి, ఎఎంసి మాజీ ఛైర్మెన్ బాడాన సునీల్‌కుమార్, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావు, నాయకులు సత్యప్రసాద్, గోవిందరావు, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని వెంకటాపురం కూడలిలో వైఎస్ రాజశేఖర రెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు బూరాడ చిన్నారావు, వెంకటాపురం సర్పంచ్ బొంతు ఎల్లం నాయుడు, అరుణ, వైసిపి నాయకులు అప్పారావు, స్వామినాయుడు, రామారావు, నెల్లి అప్పారావు, దాలినాయుడు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు

యాంత్రీకరణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

యాంత్రీకరణతో అధిక దిగుబడులు సాధించవచ్చునని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. సోమవారం పట్టణంలోని కెవికెలో ఆత్మ ఆర్థిక సౌజన్యంతో యువ రైతులకు వ్యవసాయ, ఉద్యాన పంటల్లో ఉపయోగించే వివిధ పరికరాలు, యంత్రాలపై శిక్షణ ఇచ్చారు. గ్రామీణ యువతకు వ్యవసాయ యాంత్రీకరణలో ఉన్న అన్ని మెలకువలు వారం రోజుల పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులు, శాస్త్రవేత్తలతో తరగతులు చెప్పించడం జరిగిందని విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.నీలవేణి తెలిపారు. సోమవారం కార్యక్రమంలో ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.రామచంద్రరావు, సౌమ్య పాల్గొని శిక్షణ పొందిన యువ రైతులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ శిక్షణ పొందిన యువ రైతులు యాంత్రీకరణలోని శిక్షణను వినియోగించుకొని వ్యాపార దృక్పథంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, ఆత్మ సిబ్బంది, యువ రైతులు, సృజనాత్మక రైతు బి.వి. రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ బాలాజీ ప్రసాద్

పాలిథిన్ నిషేధాన్ని పాటించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘం పరిధిలోని వర్తకులు ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని పాటించాలని పురపాలక సంఘం కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని పురపాలక సంఘ కార్యాలయంలో పట్టణంలోని చికెన్, మటన్, చేపల వర్తకులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం, ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల ప్రకారం 120 మైక్రాన్ల కంటే ఎక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్లను వినియోగించాలని, అలాగే క్లాత్, జ్యూట్ సంచులను వాడాలని వ్యాపారులకు సూచించారు. అలాగే మాంసం అమ్మే వ్యాపారులు వారి షాపులకు మెస్‌లను ఏర్పాటు చేయాలని తద్వారా రోడ్డుపై గల దుమ్ము, ధూళి, ఈగలు వాలకుండా నిరోధించవచ్చునని తెలిపారు. చికెన్, మటన్ షాపుల వద్ద కళేబరాలను వేరేగా దీయవద్దని తద్వారా కుక్కల బెడద నుంచి కొనుగోలుదారులు, పాదచారులను సంరక్షించవచ్చునని తెలిపారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ఆదేశాల మేరకు షాపుల వద్ద తడి, పొడిచెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని వర్తకులకు సూచించారు. పైనిబంధనలు పాటించని వారిపై తగు జరిమానాతో పాటు చట్ట పరమైన చర్యలు తీసుకోబడునని తెలిపారు. కార్యక్రమంలో ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ బి.సృజన, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ హనుమంతు వెంకట సత్యనారాయణ, పట్టణ వర్తకులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గిరిజనులు

రోడ్డు సదుపాయం కల్పించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని రింపి, రాంపురం తదితర గ్రామాలకు వెళ్లే రోడ్డులో గెడ్డ కల్వర్టు నిర్మాణం నిలిపివేయిందని, దీంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆదివాసీ సంఘం రాష్ట్ర నాయకులు వాబ యోగి అన్నారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనులు సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్‌కు నందిగాం హనుమంతరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డుకుని ఆనుకొని ఓ రైతు సెంటు స్థలంలో వరి పంట పండించుకుంటున్నారని అన్నారు. దీంతో ఆదివాసీలు ఆయా గ్రామాలకు వెళ్లడానికి రోడ్డు ఇబ్బందికరంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఏటా వర్షాకాలంలో ఇదేవిధమైన సమస్య ఏర్పడుతుందని తహశీల్దార్‌కు వివరించారు. జిరాయితీ భూమి అయినా సరే గిరిజనులకు ఇబ్బంది పెట్టడం సమంజసం కాదని అన్నారు. అధికారులు స్పందించి రోడ్డు సౌకర్యం కల్పించాలని, నిలిపివేసిన కల్వర్టు పనులు త్వరితగతిన నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు గురాడి అప్పన్న, సిద్దిపాలెం గోరేష్ పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న సాయిగణేష్

రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి- హిరమండలం

మండల కేంద్రంలో బసాండ్ ఆవరణ గుంతలమయమైంది. దీనిపై ఎమ్మెల్యేకు వాట్సప్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే గోవిందరావు కుమారుడు డాక్టర్ సాయిగణేష్, ఆధ్వర్యంలో డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు పురస్కరించుకొని సోమవారం మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న సభ్యులు

సేవ చేయాలనే ఆలోచన గొప్పది

శ్రీకాకుళం అర్బన్: సేవ చేయడం, సేవ చేయాలనే ఆలోచన గొప్పదని ప్రజా వైద్యులు డాక్టర్.ఇంజరాపు మోహన్ అన్నారు. ప్రతిరోజు రాత్రి నగరంలో అరసవల్లి నుంచి సింహద్వారం వరకు నిత్యాన్నదానం చేస్తున్న సేవ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యుల సహకారంతో సోమవారం అన్నదాన వితరణ చేపట్టారు. కార్యక్రమంలో శివతేజ, ఎమర్జెన్సీ ఫుడ్ సర్వీస్ ప్రతినిధి నంది ఉమ శంకర్, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి ప్రతినిధి రత్నాల మహేశ్, పాపారు అవినాష్, పొడుగు చరణ్, బొట్టా సాయి, జీల్ ఫౌండేషన్ ప్రతినిధి జాడ సాయి, మదర్ లవ్ ఫౌండేషన్ ప్రతినిధి సుప్రజ రౌత్, ఐవిఆర్ హర్ష, అల్లాడ నవీన్, మదర్స్ హెల్పింగ్ సొసైటీ ప్రతినిధి డా. పైడి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి- పలాస

విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న మీటర్ రీడర్లకు ఎస్క్రో ఎకౌంట్ ద్వారానే కనీస వేతనం ఇవ్వాలని, మీటర్ రీడర్ల సమస్యలను పరిష్కరించాలని ఎఐటియుసి డివిజన్ ప్రధాన కార్యదర్శి చాపర వేణుగోపాలరావు, డివిజన్ మీటర్ రీడర్ల అధ్యక్షుడు బి.ఓంకారరావు, కార్యదర్శి డి.భాస్కరరావు కోరారు. పలాస విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్ శాఖ డిఇ కృష్ణమూర్తికి వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో 20 ఏళ్లుగా పనిచేస్తున్నారని అన్నారు. ఎస్ క్రో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కుదించిన పని దినాలను పెంచాలని, పదేల్లుగా చేస్తున్న పోరాటాల నేపథ్యంలో యాజమాన్యం కొన్ని సమస్యల పరిష్కారానికి ముందుకు వచ్చినా అమలు చేయకపోవడం దారుణమని అన్నారు. మీటర్ రీడర్ల పైన కాంట్రాక్టర్ల ఒత్తిడి చేసి బిల్లింగ్ చేసే విధంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సవరణలో భాగంగా స్మార్ట్ మీటర్లు రావడంతో మీటర్ రీడర్లు ఉపాధి పోయే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షులు ఆర్.కుమార్‌స్వామి, జి.ఆనందరావు, కె.నరేష్, ఎస్.అఖిల్ పాల్గొన్నారు.



పలాస : నిరసన తెలుపుతున్న మీటర్ రీడర్లు

టెక్కలి : మీటర్ రీడర్లకు జీతాలు చెల్లించాలని ఆ సంఘం గౌరవాధ్యక్షులు ఎం.యుగంధర్ కోరారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఎఇ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం రూ.28 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కుమారస్వామి, శ్రీనివాసరావు, కొండాన ప్రసాద్, రాము, సతీష్ పాల్గొన్నారు.



పలాస : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుందర్‌లాల్

నిత్యావసర ధరలు తగ్గించాలి

పలాస: రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వాలు విఫలమ య్యాయని సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చాపర సుందర్‌లాల్ అన్నారు. కాశీబుగ్గ సిపిఐ పార్టీ కార్యాలయంలో పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలపై జరిగే ప్రచార, నిరసన కార్యక్రమాలకు సంబంధించి పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయని అన్నారు. ధరలు నియంత్రణ లేకపోవడంతో పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో లండ వెంకట్రావు, చాపర వేణుగోపాల్, గోరు వాసు, జబ్బకి పాల్గొన్నారు.

పోలాకి : ధరలను నియంత్రించాలని కోరుతూ సిపిఐ నాయకులు నెయ్యల నారాయణరావు, సింహాద్రి భాస్కరరావు, చిన్నబాబు, రాము, మల్లేశ్వరరావు పోస్టర్‌ను ఆవిష్కరించారు.



వరం విగ్రహానికి నివాళ్లర్పిస్తున్న కళింగ కోమట్లు

వీల్ చైర్లు అందజేత

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని కళింగ వైశ్య భవనంలో అందవరపు వరహ నర్సింహం జయంతి, వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు వరం కుటుంబ సభ్యులతో కలిసి హాజరై ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశేష సేవలు అందించారన్నారు. కళింగ వైశ్య కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్ అంధవరపు సూరిబాబు మాట్లాడుతూ జిల్లా ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తి అని కొనియాడారు. అనంతరం వికలాంగులకు వీల్‌చైర్లను అందజేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్పర్సన్ పైడిశెట్టి జయంతి, కళింగ కోమటి సంఘం నగర అధ్యక్షులు ఊన్న నాగరాజు, కళింగ కోమటి సంఘం జిల్లా అధ్యక్షులు తంగుడు జోగారావు, వరం కుమారులు అందవరపు ప్రసాద్, అందవరపు సంతోష్, సంఘం ప్రతినిధులు రమేష్ పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి

పొందూరు: మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని జిల్లా సత్యసాయి సేవా సంస్థల సమన్వయకర్త పెన్నం తరిణయ్యశెట్టి (నానాజీ) కోరారు. పట్టణంలో సత్యసాయి సేవా మందిరం ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధిలో భాగంగా మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 34 మంది మహిళలకు యోగ్యతా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సేవాసమితి కన్వీనర్ దున్న రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతులు

ఆర్‌డిఒ భరత్ నాయక్

ప్రజాశక్తి- పలాస

పలాస డివిజన్ పరిధిలో ఎవరైనా వినాయక మండపాలు ఏర్పాటు చేస్తే ముందస్తుగా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆర్‌డిఒ భరత్ నాయక్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం పోలీస్, రెవెన్యూ, ఎంపిడిఒ, విద్యుత్‌శాఖ, అగ్నిమాపక, మున్సిపల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో, పట్టణాల్లో వినాయక మండపాలు వేయకముందే ప్రజలకు వినాయక మండపాలపై అవగాహన కల్పించాలన్నారు. మండపాలు వేసేందుకు ముందస్తుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అందరి అధికారులు అనుమతులు తీసుకోవాలన్నారు. మండపాలు ఎక్కడ వేస్తున్నారు. ఎలా వేస్తున్నారు.. ఎన్ని రోజులు ఉంచుతారు. విద్యుత్ సరఫరా ఎక్కడ నుంచి తీసుకుంటున్నారు. ఏ సమయంలో నిమజ్జనం చేస్తారు. తదితర అంశాలను తప్పనిసరిగా దరఖాస్తులో పొందుపరచాలన్నారు. కాలువలపై, రోడ్లపై మండపాలు వేయరాదన్నారు. నిమజ్జనం జరిగే సమయంలో పోలీస్ బందోబస్తు తప్పనిసరిగా ఉంటుందన్నారు. మండపాలకు ఆన్‌లైన్ రుసం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ బి.సత్యం, ఎంపిడిఒ ఎస్.రమేష్‌నాయుడు, సిఐ డి.మోహనరావు, మున్సిపల్ మేనేజర్ అప్పలస్వామి, విద్యుత్‌శాఖ ఎఇలు వివేకానంద నాగభూషణరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

వరదలపై రాజకీయం తగదు

ప్రజాశక్తి- పలాస

మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ప్రకృతి విలయతాండవంపై రాజకీయం చేయడం తగదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు, ఐఎఎస్ అధికారులతో కలిసి ప్రజలకు వసతులు కూరేందుకు తిరుగుతున్నారన్నారని అన్నారు. చంద్రబాబుకు తిడితే జగన్ దృష్టిలో పడతానని మాజీ మంత్రి ఆశపడుతున్నారని అన్నారు. గత ఐదేళ్లలో ఆక్రమణలు తప్ప చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. మరో మారు రెచ్చగొట్టే వాఖ్యలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామన్నారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్‌గుప్తా, బి.నాగరాజు, మల్లా శ్రీనివాసరావు, కొరికాన శంకర్, అంబటి కృష్ణమూర్తి, దువ్వాడ శ్రీకాంత్, సప్ప నవీన్, తమ్మినేని గంగారాం, సాసుమాన చంద్రమౌళి పాల్గొన్నారు.



పలాస : మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మందస : మాజీ మంత్రి అప్పలరాజు వాఖ్యలు అర్థరహితమని టిడిపి మండల అధ్యక్షులు అధ్యక్షులు భావన దుర్యోధన, జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు అన్నారు. మంత్రి వ్యాఖ్యలను ఖండిస్తూ... టిడిపి నాయకులు విలేకరులతో మాట్లాడారు. సమావేశం తమిరి భాస్కరరావు, లబ్బ రుద్రయ్య, ముడిముంచి నవీన్ కుమార్, సిర్ల కృష్ణారావు, కొనారి తులసీరావు, ముంజేటి చంద్రశేఖర్, గార కృష్ణారావు, సాలిన జానకిరావు, అడ్డి ఈశ్వరరావు, రాపాక నారాయణ పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

కేన్సర్ ప్రాణాంతక వ్యాధుల్లో ఒకటని, ఒక్కసారి కేన్సర్ వస్తే అనారోగ్యంతో నిరంతరం పోరాడాల్సి వస్తుందని ప్రముఖ వైద్యులు డాక్టర్ పైడి సిందూర అన్నారు. సోమవారం నగరంలోని కాకినాడ శ్రీ ఆదిత్య జూనియర్ కళాశాలలో జెసిఐ శ్రీకాకుళం మెయిన్ అధ్యక్షులు కూన అనిల్ కుమార్ ఆధ్వర్యాన కేన్సర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేన్సర్‌పై అందరికి అవగాహన అవసరమని, తగు జాగ్రత్తలు పాటిస్తే కేన్సర్ దరిచేరవని, వీలైనంత వరకు ఆరుబయట తినుబండారాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ వ్యాధితో రోగికి మాత్రమే కాకుండా కుటుంబ సభ్యులకు కూడా జీవితకాలం ధైర్యం, త్యాగం అవసరమని, ఆధునిక కాలంలో టెక్నాలజీ అభివృద్ధితో కేన్సర్ చికిత్సలు మరింత ప్రభావంతంగా ఉన్నప్పటికీ, మన దేశంలో చాలా మంది ఇప్పటికీ చికిత్స లేకపోవడంతో మరణిస్తున్నారన్నారు. కేన్సర్‌కు కారణమయ్యే జీవనశైలిని నిరోధించాల్సిన అవసరం ఉందని, పొగాకు వాడకం వలన 14 రకాల కేన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని, మద్యం, మాదకద్రవ్యాల వినియోగం, సరైన ఆహారం తీసుకోకపోవడం, అసురక్షిత సంభోగం కూడా గర్భాశయ కేన్సర్‌కు ప్రధాన కారణమన్నారు. కార్యక్రమంలో కాకినాడ శ్రీఆదిత్య కళాశాలల ప్రధానోపాధ్యాయులు ఢిల్లేశ్వరరావు, ట్రెజరర్ బొడిగి మధు, జెఎస్ రాజు, కిల్లి జయకృష్ణ, పొడుగు చరణ్ తదితరులు పాల్గొన్నారు.



వైద్యులు సింధూరను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

కర్రసాముకు పూర్వవైభవం తేవాలి

శ్రీకాకుళం అర్బన్: క్రీడల్లో భాగమైన కర్రసాము కళను రేపటి తరానికి అందించాల్సిన అవసరాన్ని గుర్తించి కర్రసామును పరిరక్షించాలని, కర్రసాముకు పూర్వవైభవం తీసుకు రావాలని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ముద్దాడ కృష్ణమూర్తి నాయుడు పిలుపునిచ్చారు. నగరంలోని ఆదివారం పేటలో ఉన్న ప్రహ్లాద కళ్యాణ మండపంలో దేవ్స్ ఇండియన్ ట్రెడిషియన్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి సిలంబం పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల ముగింపు సందర్భంగా జరిగిన బహుమతి ప్రధానోత్సవంలో కృష్ణమూర్తినాయుడు పాల్గొని మాట్లాడారు. క్రీస్తు పూర్వమే కర్రసాము విద్య పుట్టిందని, అప్పటి జీవన విధానం, అందుబాటులోని వనరుల ఆధారంగా శత్రువుల నుంచి ఆత్మరక్షణకు తమిళనాడులో కర్ర సాము పురుడు పోసుకుందని తెలిపారు. నేటికీ ఈ కళ కొన్ని గ్రామాల్లో సజీవంగా ఉన్నప్పటికీ ప్రాధాన్యత లేకుండా పోయిందన్నారు. నగర యువతకు ఈ విద్యపై పూర్తిగా అవగాహన లేదన్నారు. రేయింబవళ్లు పుస్తకాలకే పరిమితమైన విద్యార్థులు అనేక ప్రాచీన కళలను విస్మరిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో కర్రసాము ఔన్నత్యాన్ని పట్టణ, నగర యువతకు అవగాహన, ఆసక్తి కల్పించేందుకు కర్రసాము పేరుతో క్రీడాపోటీలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కర్రసాము కళను పరిరక్షించేందుకు ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి కర్రసాము కళను ప్రోత్సహించాలని కోరారు. చిన్న వయసులోనే కోచ్‌గా బాధ్యతలు తీసుకొని ఎందరో చిన్నారులకు సిలంబం పోటీలకు సిద్ధం చేస్తున్న హర్షవర్ధన్‌ను అభినందించారు. పోటీలకు టెక్నికల్ డైరెక్టర్‌గా వ్యవహరించిన బలగ శివప్రసాద్ సహాయసహకారాలు అందించారన్నారు. కార్యక్రమంలో ఆరు జిల్లా జట్లు పాల్గొనగా విజయవాడ ప్రథమ, శ్రీకాకుళం ద్వితీయ, ఏలూరు తృతీయ స్థానాలు నిలిచి నగదు బహుమతులు పొందాయన్నారు. ఓవరాల్ చాంపియన్‌గా విజయవాడ నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో సిలంబం జిల్లా ప్రతినిధులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్యశ్రీకాంత్, శ్యామ్‌సుందరరావు, చంద్రమౌళి, ఎల్.నాగేశ్వరరావు, రాము యాదవ్, వివిధ జిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు.




ట్రోఫీని అందజేస్తున్న కృష్ణమూర్తి నాయుడు

సుభద్రాపురంలో అపారిశుద్ధ్యం

- పట్టించుకోని అధికారులు
- ఈగలు, దోమలతో ప్రజలు ఇక్కట్లు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని తాళ్లవలస గ్రామ పంచాయతీ శుభద్రపురంలో గతకొన్నాళ్లుగా పారిశుధ్య పనులు నిర్వహించకపోవడంతో వీధుల్లో మురుగునీరుతో పాటు అపారశుద్ధ్యం తాండవిస్తుంది. ఇళ్లముందు మురుగునీరు నిల్వ ఉండడంతో పాటు వీధి కాలువలు లేక ఎక్కడి మురుగునీరు అక్కడే పేరుకుపోయి దుర్గంధపు వాసనతో ఈగలు, దోమలు స్వైన విహారం చేస్తున్నాయి. దీంతో పలు వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. పలుమార్లు సర్పంచ్, కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకొనే నాధుడే లేరని వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు చేయించేలా చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే కొంతమంది వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారని, గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కాలువలు లేక రహదారి మధ్యలో ఉన్న మురుగునీరు



ఇళ్ల ముందే ఉన్న మురుగు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

పింఛన్ల నిలుపుదల సరికాదు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని మశకాపురం పంచాయతీలో టిడిపి కూటమి ప్రభుత్వం పింఛన్లను నిలుపుదల చేయడం తగదని ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఈశ్వరరావుతో సోమవారం మాట్లాడారు. పింఛన్లు ఆపడం సరికాదని, వెంటనే పునరుద్ధరించాలని కోరారు. ఎంపిడిఒ సమాధానమిస్తూ క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులకు పింఛన్లు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి బోర పుష్ప, జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ, వైసిపి నాయకులు నర్తు వరప్రసాద్, పి.రాజశేఖరరెడ్డి, పిట్ట మామయ్య, పిలకా సంతోష్‌రెడ్డి, ప్రకాశరావు పట్నాయక్ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఇఒ రమేష్ బాబు

అరసవల్లిలో వన మహోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వన మహోత్సవంలో భాగంగా అరసవల్లి సూర్య నారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఇంద్రపుష్కరిణి వద్ద సోమవారం ఆలయ ఇఒ డిఎల్‌వి రమేష్‌బాబు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మల ఆధ్వర్యాన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉసిరి, రావి, నేరేడు, శ్రీగంధ, సీత, మారేడు, తెల్లమద్ది, కదంబం, వెలగా, చింత, వేప, ఎర్ర చందనం, అశోక, దేవకాంచనం, మామిడి, జమ్మి, సీతాఫలం తదితర మొక్కలను నాటారు.

కషాయాలతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

కషాయాలు వినియోగించడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చునని డిజిటల్ ఎల్‌టు సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా రైతుల ఆధ్వర్యంలో కషాయాలను తయారు చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ చేపేనపేట యూనిట్ ఆధ్వర్యంలో యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి ఆధ్వర్యంలో వరి పంటకు అవసరమైన తూటికాడ బ్రహ్మాస్త్రం, దశపర్ని కషాయాలను రైతులతో తయారు చేయించినట్లు తెలిపారు. తూటికాడ కషాయాన్ని చేపేనపేట, నిమ్మతొర్లాడ, కొత్తవలస, జి.కె వలస రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రస్తుత వరి పంటకు కషాయాలను క్షేత్రస్థాయిలో తయారు చేయించి రైతులకు అందుబాటులో ఉంచి రైతులకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో కషాయాలను తయారు చేయుటకు ఎంతో ఆసక్తితో ముందుకు వస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి, జానికిరామ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

మెళియాపుట్టి : మండలంలోని మెళియాపుట్టిలో పారిశుధ్య పనులను ఎంపిడిఒ పడాల చంద్రకుమారి, ఇఒపిఆర్‌డి తిరుపతి పట్నాయక్ సోమవారం పరిశీలించారు. కాలువలను శుభ్రం చేస్తూ... చెత్తను తొలగించారు. తాగునీటి పథకాలు, బోర్ వెల్ వద్ద, వీధుల్లో, కాలువల్లో బ్లీచింగ్ వేయించారు. కార్యక్రమంలో కార్యదర్శి చింతల అప్పారావు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలి

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ సూదికొండ ప్రాంతంలో గిరిజన సామాజిక భవన నిర్మాణానికి ఐదు సెంట్లు కేటాయించారని, భవన నిర్మాణానికి ధ్రువపత్రం మంజూరు చేయాలని ఆదివాసీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ సభ్యులు కోరారు. ఈ మేరకు తహశీల్దార్ బి.సత్యంను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గిరిజన భవన నిర్మాణానికి స్థలం కేటాయించారని అన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి ధ్రువపత్రం మంజూరు చేయలేదని తెలిపారు. ప్రస్తుతం ఆ స్థలం మా ఆధీనంలో ఉన్నా పొజిషన్ ధ్రువపత్రం, పట్టాను మంజూరు చేయలేదని అన్నారు. వినతిపత్రం అందజేస్తున్న వారిలో ఎఐఎఇఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సవర జగన్నాయకులు, మండల అధ్యక్షుడు పి.ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరరావు, కోశాధికారి ఎస్.లోకేశ్వరరావు, ఎస్.మోహనరావు, యుటిఎఫ్ అధ్యక్షుడు సిద్దు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న రవికుమార్ తదితరులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలని మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యులు అన్నారు. సోమవారం శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో నగరంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ మానవతా సంస్థ నైతిక విలువలతో కూడిన నవసమాజ నిర్మాణం కోసం కృషి చేస్తుందని, సంస్థను సమర్థవంతంగా తీర్చిదిద్ది, భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని, అందరం కలిసి శాంతి సమాజ నిర్మాణంలో భాగమై, నగరాన్ని కాలుష్య రహిత ప్రాంతంగా వృద్ధి చేస్తామన్నారు. నగరంలో ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలో మొక్కలు నాటారు. వాటి పరిరక్షణ బాధ్యతను సంస్థసభ్యులు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ టేకి శ్రీనివాస్, ట్రెజరర్ సింగూరు ప్రవీణ్ కుమార్, అరుణ కుమారి, చైర్మన్ ప్రొఫెసర్ విష్ణుమూర్తి, సభ్యులు రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల పక్షం

ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

PRAJASAKTI 44 ANNIVERSARY 1981-2024

ప్రత్యేక అనుబంధం

శ్రీకాకుళం డివిజన్

మంగళవారం 03-9-2024 | 16 పేజీలు

స్వాతంత్ర్య ఉద్యమం, తర్వాత ప్రజాశక్తి ఉజ్వల పాత్ర

ఏదైనా ఒక ఉద్యమం అది స్వాతంత్ర్య పోరాటం కావచ్చు, విప్లవ కార్యాచరణ కావచ్చు. అలాంటి సమయాలలో ప్రతి దేశంలోనూ పత్రికలు విశిష్ట పాత్రను పోషించాయి. అందుకే వాటి పాత్ర గురించి లెనిన్ ఇలా అన్నారు. ' పత్రిక సమిష్టి ఆందోళన కారుడు మాత్రమే కాదు... సమిష్టి ఉద్యమ నిర్మాత కూడా'.

భారతదేశంలో అభ్యుదయ భావాలు-పత్రికలు

భారతదేశంలో సోషలిస్టు భావాల్ని ప్రచారం చేయటానికి మొట్టమొదటిగా 'సోషలిస్టు' అనే వారపత్రిక 1922 ఆగుస్టు 5న ప్రారంభమైంది. మన స్వాతంత్ర్య ఉద్యమంలో కాన్పూరు కుట్ర కేసు (మిగతా...2లో)

స్వాతంత్ర్య ఉద్యమం, తర్వాత ప్రజాశక్తి ఉజ్వల పాత్ర

(మొదటిపేజీ తరువాయి)

దేశవ్యాప్తంగా పెద్ద సంచలనాన్ని రేకెత్తించింది. సరిగ్గా ఆ కాలంలోనే కమ్యూనిస్టు భావాలు దేశం నలుమూలలకూ వ్యాపించటం ప్రారంభమయింది.

సోషలిస్టు భావాల వ్యాప్తికి దేశంలో రహస్యంగా ప్రచురింపబడిన పత్రికలు, పుస్తకాలతో పాటు, ఇంగ్లండ్ నుండి రహస్యంగా ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పోలీసుల కన్నుగప్పి పత్రికలు, పుస్తకాలు వచ్చేవి. ఈ సారస్వతం యువకులకూ, విద్యార్థులకూ అమృత సమానంగా ఉపకరించేవి. 1934-39 మధ్యకాలంలో మద్రాసు నుండి వెలువడిన 'న్యూఏజ్' ఆంగ్ల మాసపత్రిక దక్షిణ భారతదేశంలో, 1937లో పి.సి.జోషి సంపాదకత్వంలో బొంబాయిలో ప్రారంభించబడిన 'నేషనల్ ఫ్రంట్' వారపత్రిక కమ్యూనిస్టు ఉద్యమంతోపాటు ప్రజాసంఘాల నిర్మాణానికి కూడా ఎంతగానో తోడ్పడింది.

ఆంధ్రలో 1933 తర్వాత కమ్యూనిస్టు ఉద్యమం ప్రారంభమైంది. అభ్యుదయ భావాలను ప్రచారం చేసేందుకు 1937లో 'నవశక్తి' వారపత్రిక ప్రారంభించబడింది.

రెండో ప్రపంచయుద్ధం 1939లో ప్రారంభమైంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు బ్రిటన్‌తోపాటు భారతదేశాన్ని కూడా యుద్ధంలోకి దింపారు. ఆ కాలంలో బ్రిటిష్ చర్యను విమర్శించిన పత్రికలు క్రూరంగా అణచివేయబడ్డాయి. 'నేషనల్ ఫ్రంట్' వారపత్రికతోపాటు, వివిధ భారతీయ భాషల్లో ముద్రింపబడే పత్రికలన్నీ నిషేధింపబడ్డాయి. తర్వాత వివిధ రాష్ట్రాల మధ్య సంధానకర్తగా, 'కమ్యూనిస్టు' పేరుతో ఆంగ్లంలో మాసపత్రిక ప్రచురించబడింది. ఆ కాలంలో ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి వివిధ భాషల్లో రహస్య పత్రికలు పరిమిత స్థాయిలోనైనా నడిచాయి. ఆంధ్రదేశంలో 'స్వతంత్ర భారత్' ఒకటి.

జాతీయ, అంతర్జాతీయ మార్పుల దృష్ట్యా 1942లో కమ్యూనిస్టుపార్టీపై నిషేధం తొలగింపబడింది. ఆంధ్రలో ప్రజాశక్తి వారపత్రిక వెలువడింది. 1945లో అది దినపత్రికగా ప్రచురించబడింది. 1948-52 మధ్యకాలంలో కమ్యూనిస్టు పార్టీ తిరిగి తీవ్ర నిర్బంధ విధానానికి గురయింది. కమ్యూనిస్టులు పని చేసే పత్రికలను కూడా ప్రభుత్వం నిషేధించింది. నిర్బంధ కాలంలో బొంబాయి నుండి గుజరాతీ, మరాఠీ భాషల్లో 'మషాల్' పేరుతో దినపత్రికలు వెలువడ్డాయి. కొన్ని మాసాల తర్వాత అవి నిషేధించబడ్డాయి. తర్వాత 1949-51 మధ్యకాలంలో మరాఠీభాషలో 'యుగంతర్' గుజరాతీ భాషలో 'జై గుజరాత్' వారపత్రికలు వెలువడ్డాయి.

1952 తర్వాత

1952 నుండి తిరిగి కమ్యూనిస్టు పార్టీ బహిరంగంగా పనిచేయసాగింది.. దేశవ్యాపితంగా వివిధ భాషల్లో పత్రికలు ప్రారంభించబడ్డాయి. ఆంధ్రాలో 'ప్రజాశక్తి' 'మళయాళంలో' దేశాభిమాని', బెంగాల్‌లో 'స్వాధీనత' అలాంటి పత్రికలే.

ఉత్తేజకర స్మృతులు

బొంబాయి నుండి వెలువడే పత్రిక 'నేషనల్ ఫ్రంట్' ద్వితీయ ప్రపంచ సంగ్రామం ప్రారంభం కాగానే నిషేధింపబడింది. ఆ తర్వాత 'కమ్యూనిస్టు' పేరుతో ఆంగ్ల మాసపత్రిక రహస్యంగా ప్రచురించబడింది. పోలీసులు బొంబాయిలో దీనికి పెద్ద ప్రెస్ ఉండేదని భావించేవారు. కానీ ఒక చిన్న ప్రెస్ మాత్రమే ఉండేది. ఆ ప్రెస్ కోసం రెండున్నర సంవత్సరాల కాలం పోలీసులు బొంబాయి నగరమంతా గాలించారు. కాని ప్రెస్ స్థావరం దొరకలేదు. అలా అడుగడుగునా ఆపదల్ని ఎదుర్కొంటూ ప్రాణసమానంగా ప్రెస్‌ను కాపాడుకోవాల్సి వచ్చేది. ఆ రోజుల్లో బెంగాల్, పంజాబ్, ఆంధ్ర తదితర ప్రాంతాలకు చెందిన ఎంతోమంది యువకులు కంపోజిటర్స్‌గా ఆ ప్రెస్‌లో పనిచేశారు. ఆ రోజుల్లోనే ఆంధ్రదేశానికి చెందిన వెంకటేశ్వరరావు అనే కంపోజిటర్ రహస్య ప్రెస్‌లో పనిచేస్తూ మృతి చెందాడు. పత్రికల్లో పనిచేయటానికి, త్యాగాలు చేయటానికి, ఆ రోజుల్లో ఎంతోమంది ఉత్సాహపడుతూ ఉండేవారు. ఎడిటర్లు, వర్కర్లు అందరూ పూర్తికాలం అదే పనిగా ఉన్న వారే. అదేవిధంగా వేతనాలలో కూడా వ్యత్యాసాలు ఉండేవి కావు. ప్రతి ఒక్కరికీ రు.25/-లు వేతనం ఇవ్వబడేది. కుటుంబం ఉన్నవారికి మాత్రం అదనంగా రు.30/-లు అలవెన్సు ఇవ్వబడేది. ప్రెస్‌లో పనిచేసేవారిలో పెక్కుమంది బ్రహ్మచారులుగా ఉండేవారు. పని ఒత్తిడిగా ఉండటం వల్ల ఆ రోజుల్లో రెండు షిఫ్టులు నిర్వహింపబడేవి. అవసరం అయినప్పుడు సిబ్బంది రోజుకు 20 గంటలు పనిచేసేవారు.

ప్రెస్‌పై దాడి - వీరోచిత ప్రతిఘటన

1945 జనవరిలో బొంబాయిలో కాంగ్రెస్ వాళ్ల జనాన్ని రెచ్చగొట్టి పత్రిక ప్రెస్‌పై దాడి చేయించారు. ప్రెస్‌లోని ప్రతి ఒక్క కార్మికుడూ వీరోచితంగా నిలబడి ప్రతిఘటించారు. దాడిచేసిన మూక వందరెట్లు ఉన్నా కార్మికులు చలించలేదు. తరిమితరిమి కొట్టారు. దాదాపు కార్మికులందరికీ ఆ ప్రతిఘటనలో దెబ్బలు తగిలాయి. అయినా నిలబడి ఎదుర్కొన్నారు. దుండగుల దాడిలో అచ్చుయంత్రం దెబ్బతిన్నది. న్యూస్‌ప్రింట్ కాల్చివేయబడింది. అయినా పత్రిక ఆగిపోలేదు. మరో ప్రెస్‌లో రాత్రింబవళ్లు పనిచేసి రెండు వారాలపాటు పార్టీ పత్రికలు ముద్రింపబడ్డాయి. అటు తర్వాత కూడా కాంగ్రెస్‌వాదులు పెక్కుసార్లు ప్రెస్‌పై దాడిచేశారు. ఒకసారి బాంబు కూడా విసిరారు. 1950లో ప్రజాశక్తి మేనేజర్ నాగులపల్లి కోటేశ్వరరావును అరెస్టుచేసి రాజమండ్రివద్ద కాల్చి చంపారు.

ఆంధ్రలో పత్రికలు

ఆంధ్రలో ప్రచురించబడిన అభ్యుదయ, కమ్యూనిస్టు పత్రికలకు కూడా ఉజ్వల చరిత్ర ఉంది. ఎన్నో నిర్బంధాలు... ఎన్నో ఆటుపోట్లు.. ఎంతో దమనకాండ.. వాటన్నింటినీ త్యాగదీక్షతో.. ఆశయబలంతో ఎదుర్కొని ఇక్కడ కూడా పత్రికలు ప్రచురించాల్సి వచ్చింది.

ఉప్పు సత్యాగ్రహం అనంతరం అనేకమంది యువకులు, టెర్రరిస్టు భావాలుగల వారు సోషలిజం వైపుకు ఆకర్షింపబడ్డారు. తత్ఫలితంగా కొన్ని పత్రికలు వామపక్ష రాజకీయాలతోపాటు, సోషలిస్టు భావాలను అవి స్పష్టంగా ప్రచారం చేయనారంభించాయి. 1935 ప్రాంతంలో 'ప్రభ' అనే పక్షపత్రిక అతివాద భావాలను, కొంతవరకు సోషలిస్టు భావాలను వ్యాప్తిలోకి తెచ్చింది.

'నవశక్తి'

అయితే... సోషలిస్టు పత్రికగా ఆంధ్రదేశంలో మొట్టమొదటిసారిగా ప్రచురింపబడిన పత్రిక 'నవశక్తి'. 1937, డిసెంబర్ 15న రాజమండ్రి నుండి ఆ తర్వాత విజయవాడ నుండి నడపబడింది. ఆ కాలంలో కమ్యూనిస్టు పార్టీ నిషేధంలో ఉంది. కొన్నాళ్లు రాజమండ్రి నుండి నడిచిన నవశక్తి ఆ తర్వాత విజయవాడ నుండి వెలువడింది.

నవశక్తి త్రిపుర కాంగ్రెస్ సంచిక భారత జాతీయోద్యమాన్ని మార్క్సిస్టు దృక్పథంతో సింహావలోకనం చేసింది. అలాగే రష్యన్ సంచిక సోవియట్ విజయాలను వివిధ వ్యాసాలలో వివరించింది. పై రెండు ప్రత్యేక సంచికలు దేశభక్తుల్ని ఎంతగానో ఆకర్షించి, వారు కమ్యూనిజంవైపు మొగ్గటానికి తోడ్పడినాయి.

రెండో ప్రపంచయుద్ధం ఆరంభం కాగానే నిర్బంధ విధానం తీవ్రమైంది. దాన్ని ముందుగానే పసికట్టి పత్రికకు సంబంధించిన ప్రెస్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకోకుండా ముందే జాగ్రత్తలు తీసుకొని నాయకులతో పాటు సంపాదకులు కూడా అజ్ఞాతవాసంలోకి వెళ్లిపోయారు.

రహస్య పత్రికగా 'స్వతంత్ర భారత్'

1939-42 మధ్యకాలంలో 'స్వతంత్ర భారత్' అనే పత్రిక రహస్యంగా ప్రచురించబడింది. ఆ పత్రిక దగ్గర ఉంటే జైలుశిక్ష పడే రోజులవి. అయినా అనేకమంది ఆ పత్రికను చదివేవారు.



ప్రజాశక్తి ప్రధాన కార్యాలయం

ప్రజాశక్తి వారపత్రిక

1942 జూన్‌లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగింపబడటంతో నాయకులు చాలామంది అజ్ఞాతవాసం నుండి, జైళ్ల నుండి బయటకి వచ్చారు. ఆ స్థితిలో 1942, జూన్ 17న ప్రజాశక్తి వారపత్రికగా అవతరించింది. అధికార రీత్యా కమ్యూనిస్టు పత్రికగా పేర్కొనబడిన మొదటిపత్రిక ప్రజాశక్తి. ఆ విధంగా రెండున్నర సంవత్సరాలపాటు వారపత్రికగా ప్రజాశక్తి నడిచింది.

దినపత్రికగా ప్రజాశక్తి

ఇప్పటివలె కాక ఆనాడు ఒక కమ్యూనిస్టులు పనిచేసే దినపత్రిక ప్రచురణకు ప్రభుత్వ అనుమతి పొందాలంటే చాలా కష్టమైన పని. దానికితోడు దినపత్రికకు అవసరమైన సిబ్బందిని, యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవటానికి తగిన వనరులు, డబ్బు కూడా అవసరం. దినపత్రిక నిధికి పిలుపు ఇవ్వగానే సామాన్య ప్రజలు, పార్టీ అభిమానులెందరో విరాళాలందించారు. అభ్యుదయ యువకవులు సంపాదకవర్గంలో పనిచేయటానికి తమ సంసిద్ధత వెల్లడించారు. ప్రఖ్యాత చిత్రకారుడు, కవి, నవలాకారుడు అయిన అడవి బాపిరాజు ఉత్తేజితుడై తనంతతానుగా ప్రజాశక్తి ముఖచిత్రానికి అక్షరాలు రాసి పంపారు.

1945 డిసెంబర్ 3న ప్రజాశక్తి దినపత్రిక తొలి సంచిక విజయవాడ నుంచి వెలువడింది. ఆ విధంగా తెలుగునాట శ్రామికుల వాణిగా, అభ్యుదయ భావాల పతాకంగా ఉంది. ఆధునిక సౌకర్యాలు లేని ఆనాడు, విజయవాడలో దినపత్రిక నడపాలంటే అంత సులువైన పనికాదు. సంపాదకవర్గంలో చేరిన వారెవరికీ దినపత్రికలోఅంతకుముందు పనిచేసిన అనుభవం లేదు. దీక్ష, ఉత్సాహమే వారికున్న పెట్టుబడి. వివిధ ప్రజా ఉద్యమాల్లో పనిచేసే కార్యకర్తలే ఎక్కడికక్కడ పత్రికా విలేకరులుగా పనిచేసేవారు.

ప్రజలిచ్చిన విరాళాలతో, కాట్రగడ్డ సోదరుల తోడ్పాటుతో మొగల్‌రాజపురంలో 'ప్రజాశక్తి నగర్' వెలిసింది. అక్కడే పత్రికలో పనిచేసేవారు కాపురాలుండేవారు. అభిమానులకు ప్రజాశక్తినగర్ యాత్రాస్థలంగా ఉండేది. ఎన్ని ఇబ్బందులెదుర్కోవాల్సి వచ్చినా ప్రజాశక్తి తెలుగు పత్రికా ప్రపంచంలో విశిష్ట స్థానాన్ని పొందగలిగింది.

1948లో కమ్యూనిస్టు ఉద్యమంపై నిర్బంధకాండ ప్రారంభమైంది. పత్రికా కార్యాలయంపై పలుమార్లు పోలీసుదాడులు జరిగాయి. చివరికి నిర్బంధకాండ తీవ్రతరమైంది. పత్రిక ముద్రణాలయాన్ని, ప్రచురణల్ని, గ్రంథాలను పోలీసులు దాడిచేసి నాశనం చేశారు. ఆ విధంగా 1948 ఏప్రిల్ 22 తేదీలో ప్రజాశక్తి మూతపడ్డది.

రహస్య కాలంలో పత్రికలు

ప్రభుత్వ క్రూర నిర్బంధకాండలో... పాశవిక దాడుల్లో చాలామంది నాయకులు జైళ్లలో మగ్గవలసి వచ్చింది. వేలాదిమంది కాల్చివేయబడ్డారు. చిత్రహింసలకు గురిచేయబడ్డారు. అలాంటి పరిస్థితుల్లో పార్టీ సందేశాన్ని ప్రజలకు వేర్వేరు రూపాల్లో అందించటానికి కొన్ని పత్రికలు కృషిచేశాయి. జనత, సందేశం, జనవాణి పత్రికలు అలా నడుపబడ్డాయి.

తిరిగి ప్రజాశక్తి ప్రచురణ

1951 ఆగస్టు నుండి నిర్బంధకాండ కొంతవరకు సడలింది. ప్రధాన నాయకులంతా ఇంకా జైలులోనూ, అజ్ఞాతవాసంలోనూ ఉండగానే 1951 నవంబర్ 21వ తేదీ నుండి ప్రజాశక్తి వారపత్రికగా వెలువడటం ప్రారంభమైంది. 1952 జనరల్ ఎన్నికల సందర్భంగా ద్వైవారపత్రికగా వెలువడింది.

'విశాలాంధ్ర' ప్రారంభం

ఎన్నికల అనంతరం కమ్యూనిస్టు ముఖ్య నాయకులంతా బహిరంగంగా రావటంతో తిరిగి దినపత్రిక ప్రచురించాలని, ఆంధ్ర రాష్ట్రాన్నే గాక విశాలాంధ్రను కూడా సాధించాలనే లక్ష్యంతో దినపత్రికకు 'విశాలాంధ్ర' పేరు పెట్టారు ఆ విధంగా 1952 జూన్ 22న దినపత్రిక అవతరించింది.

మరో మజిలీ - జనశక్తి దినపత్రిక

జైలు నుండి నాయకులంతా బయటికి వచ్చిన తర్వాత రానున్న జనరల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని జనశక్తిని దినపత్రికగా తీసుకురావాలని నిర్ణయించారు. ఆ విధంగా 1966 సెప్టెంబర్ ఒకటిని జనశక్తి దినపత్రికగా ప్రచురణ ప్రారంభమైంది.

ప్రజాశక్తి పునర్వికాసం

తరువాత1968 జులై 28న 'ప్రజాశక్తి' వారపత్రికగా పునరుద్ధరిం పబడింది. 13 సంవత్సరాలపాటు ప్రజాశక్తి వారపత్రికగా, ద్వైవారపత్రికగా, ఎన్నికల సందర్భంలో దినపత్రికగా వెలువడింది. 1981 ఆగస్టు ఒకటి నుండి ప్రజాశక్తి దినపత్రికగా నడుస్తున్నది.విజయవాడ నడిబొడ్డున గల తన విలువైన స్థలాన్ని కాట్రగడ్డ శ్రీనివాసరావుగారు తాను అమితంగా అభిమానించే సుందరయ్యగారి జన్మదిన కానుకగా ప్రజాశక్తి కార్యాలయ భవన నిర్మాణానికి బహూకరించారు.

ప్రజాశక్తి దినపత్రిక దినదినాభివృద్ధి చెందుతున్న దృష్ట్యా వివిధ ప్రాంతాలకు తాజా వార్తలతో సంచికను అందించేందుకు వీలుగా హైదరాబాద్ ఎడిషన్ 1994లోను, విశాఖపట్నం ఎడిషన్ 1997లోనూ, ఆ తర్వాత తిరుపతి ఎడిషన్2001 లోనూ, ఖమ్మం, కర్నూలు ఎడిషన్లను 2003లోను, గోదావరి ఎడిషన్ రాజమండ్రిలో 2005లో ప్రారంభమైంది. త్వరలోనే ఉత్తర తెలంగాణా ప్రాంతానికి కరీంనగర్‌లో ఎనిమిదవ ఎడిషన్ ప్రారంభం కానుంది. పత్రికల నిర్వహణకు ఆయన చేసిన అపారమైన కృషికి చిహ్నంగా హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో నిర్మించతలపెట్టిన ప్రజాశక్తి భవనానికి ఆయన పేరుతో 2005 మార్చిలో శంకుస్థాపన జరిగింది. తొలి ప్రజాశక్తి దినపత్రిక అనంతరం తిరిగి దినపత్రికగా 1981 ఆగస్టులో పున: ప్రారంభమైంది.

- వి.ఆర్. బొమ్మారెడ్డి

దేశ వారసత్వ సంపదలో భాగంగా ప్రంచంలోనే పొందూరు ఖద్దరు వస్త్రాలు ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకున్నాయి. స్వాతంత్రోద్యమ కాలంలో ఈ ప్రాంతాన్ని సందర్శించే సమయంలో బాపూజీ ప్రశంసలే ఇక్కడి కళారూపానికి ప్రస్థానమైంది. ఖాదీ కళాకారుల నైపుణ్యమే సంస్థ అభివృద్ధికి దోహదపడుతుంది. జాతిపిత మహాత్మా గాంధీ మొదలుకొని అగ్రరాజ్యం అమెరికా మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్‌తో పాటు ఎంతో మంది విదేశీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రముఖ సినీనటులనే కాకుండా యువతను సైతం ఈ ఖాదీ వస్త్రాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. భారతీయ ఖాదీ విఫణిలో పొందూరు ఖద్దరుకు అగ్రస్థానం. ప్రాశ్చాత్య పోకడలతో సాగుతున్న ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో పోటీతత్వాన్ని తట్టుకుంటూ ఖద్దరు వస్త్రం నిలదొక్కుకుందంటే ఇక్కడి నేత కార్మికుల నైపుణ్యమే కారణమని చెప్పవచ్చు. ఆధునిక సంప్రదాయాలు, మారుతున్న అభిరుచులతో పొందూరు ఖద్దరు ప్రపంచ నలుమూలలా విస్తరించిందంటే ఖాదీ కార్మికుల కష్టార్జితమేనని చెప్పవచ్చు. పొందూరు ఖద్దరు అంటే మక్కువ చూపని వారుండరు. సుమారు ఏడు దశాబ్దాల క్రితం కుటీర పరిశ్రమగా మొదలై అందుబాటులో ఉన్న పరికరాలను వినియోగించుకుంటూ ఎన్నో కుటుంబాలకు జీవనాధారంగా నిలుస్తూ పొందూరుకు కీర్తి ప్రతిష్టలను తీసుకువస్తూ అగ్రస్థానంలో నిలిపింది.

– ప్రజాశక్తి, పొందూరు



రాట్నంతో వడుకుతున్న మహిళలు

పొందూరు ఖాదీ ప్రపంచ ఖ్యాతి

- దేశంలో ప్రత్యేక స్థానం
- 2021లో లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం
- పొందూరు ఖద్దరు తయారీపై వీడియో చిత్రీకరణ పోటీలు



ఖాదీ వస్త్రాలను విక్రయిస్తున్న సిబ్బంది

1949 ఏప్రిల్ 1వ తేదీన ఆంధ్ర సన్నఖాదీ కార్మికాభివృద్ధి సంఘం ఆవిర్భవించింది. ఆచార్య వినోబాబావే 1955 అక్టోబరు 13న పొందూరులో ఆంధ్రాఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం భవనానికి శంకుస్థాపన చేశారు. దేశ వ్యాప్తంగా అత్యున్నత ప్రమాణాలు గల సన్నఖాదీ ఇక్కడే అందుబాటులో ఉంది. దేశంలో సుమారు రెండు వేల సిర్టఫైడ్ ఖాదీ సంస్థలున్నప్పటికీ పొందూరు ఖాదీ పరిశ్రమ అగ్రస్థానంలో నిలుస్తుంది. తెలుగు సంప్రదాయానికి నిలువుటద్దలా నిలుస్తూ తన అస్తిత్వాన్ని నిలుపుకొంటుంది. దేశంలోని పలు మిల్లుల వస్త్రాల నుంచి పోటీని తట్టుకుంటూ తన మనుగడను సాగిస్తుంది.

దేశవ్యాప్తంగా ఆదరణ

పొందూరులో తయారయ్యే జమదానీ చీరలు, జరీ వజా కుప్పడం, బుటాజరీ కుప్పడం చాపులు, వివిధ రకాలైన షర్టింగ్‌లకు దేశమంతటా ఆదరణ ఉంది. ఈ రకాలు విదేశీయులను సైతం ఆకట్టుకుంటున్నాయి. జపాన్, స్వీటన్ నార్వే, డెన్మార్క్, అమెరికా, జర్మనీ తదితర దేశాలకు చెందిన నిపుణులు పలుమార్లు పొందూరులో పర్యటించి ఇక్కడి ఖాదీ వస్త్రాల తయారీ ప్రక్రియను చూసి అబ్బురపోయారు.

పారిశ్రామిక విప్లవం రాకముందు రాట్నంతో తీసిన దారంతో తయారైన వస్త్రాలకు ఎంతో ప్రాముఖ్యం ఉండేది. ఇక్కడ తయారయ్యే నూలు వస్త్రాలను ఈస్టిండియా కంపెనీ మచిలీపట్నం ఓడరేవు నుంచి ఇంగ్లాండ్, యూరప్ దేశాలకు ఎగుమతి చేసేది. ఇక్కడ నూలు వస్త్రాలు అప్పట్లోనే ఎంతో ఖరీదు కావడంతో రాజులు, సంపన్నులు మాత్రమే కొనుగోలు చేసి వినియోగించేవారు.

సుమారు రూ.7 కోట్లు టర్నోవర్

పొందూరులో 1971-72లో రూ.5లక్షల విలువైన వస్త్రాల సామర్థ్యంతో ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం ఉత్పత్తులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఏటా సుమారు రూ.3.04 కోట్లు విలువ చేసే ఉత్పత్తులు చేపడుతుండగా, విక్రయాలు రూ.4.66 కోట్లుపైగా జరుగుతున్నాయి. మొత్తం మీద ఏటా నంవారం రూ.7.70 కోట్లు టర్నోవర్ జరుగుతుంది. ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం పరిధిలో దాదాపు 40 గ్రామాలకు చెందిన సుమారు వంద మంది నేత కార్మికులు, సుమారు వెయ్యి మంది వడుకు కార్మికులు ఉపాధి పొందుతున్నారు.

తయారీ విధానం



పత్తి నుంచి దారం తయారు చేస్తున్న మహిళా కార్మికులు

కొండ పత్తిని చేపముల్లుతో శుభ్రం చేయడం దగ్గర నుంచి రాట్నంపై దారం తీసి మగ్గంపై నేయడం వరకు వివిధ ప్రక్రియలన్నీ చేతితోనే చేయడం పొందూరు ఖాదీ విశేషం. పొందూరులో ఖాదీ కార్మికులు తమ ఇళ్ల వద్ద కుటీర పరిశ్రమగా పత్తి నుంచి దారం తయారు చేసే ప్రక్రియను చేపడతారు. ఇక్కడ నేత కార్మికులు ఇంటిల్లిపాదీ దారం తీసే వివిధ ప్రక్రియలను చేపడుతూ జీవనం సాగిస్తున్నారు. సంస్థే వీరికి కొండ పత్తిని విక్రయిస్తూ వీరి నుంచి దారం తీసిన చిలపలను కొనుగోలు చేస్తుంది. దారం తయారైన కౌంటు ఆధారంగా దాని ధరను నిర్ణయించి సంస్థ కొనుగోలు చేస్తుంది.

జిల్లాలో విక్రయ కేంద్రాలు

పొందూరు ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘం ఆధ్వర్యాన జిల్లాలో పొందూరు పట్టణంలో రెండు, రాజాం పట్టణంలో రెండు, శ్రీకాకుళం పట్టణంలో ఒకటి, పాలకొండ పట్టణంలో ఒకటి, మెళియాపుట్టి పట్టణంలో ఒకటితో పాటు, విజయనగరం జిల్లా చీపురపల్లి పట్టణంలో ఒకటి చొప్పున ఖాదీ వస్త్రాల విక్రయ కేంద్రాలు ఉన్నాయి.



వస్త్రాన్ని నేస్తున్న కార్మికుడు



ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంస్థ

పొందూరు ఖద్దరుపై వీడియో చిత్రీకరణ పోటీలు

2024 ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ పొందూరు ఖద్దరు వస్త్రాలు తయారీపై వీడియో చిత్రీకరణ పోటీలను చేపట్టింది. ఇందుకోసం రాష్ట్ర నలుమూలల నుంచి ఎంతో మంది ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో విజేతగా నిలిచిన వారికి ప్రభుత్వం ప్రసంశా పత్రంతో పాటు నగదు ప్రోత్సాహకాన్ని అందజేయునున్నట్లు ప్రకటించింది.

2021లో లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డు

మాజీ ముఖ్యంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని పొందూరు ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంఘానికి 2021లో లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును ప్రకటించింది. ఖాదీ వస్త్రాలను, తయారీని ప్రోత్సహిస్తూ కార్మికులకు ఉపాధిని కల్పిస్తున్న ఎఎఫ్‌కెకె సంఘానికి ప్రభుత్వం తగిన గుర్తింపునిచ్చింది. ఈ అవార్డు కింద రూ.10 లక్షలు నగదును స్వతంత్ర దినోత్సవం వేడుకల సందర్భంగా సంస్థకు అందజేశారు. ఈ మొత్తాన్ని సంఘం ఆవరణలో ఆరు దుకాణాలతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టామని అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.



తయారైన ఖాదీ వస్త్రాలు

ప్రభుత్వ ప్రోత్సాహంతో మరింత అభివృద్ధి

పొందూరు ఎఎఫ్‌కెకె సంఘం అభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం ఎంతో అవసరం. ఒకప్పుడు ఇదే వృత్తిని జీవనాధారంగా స్వీకరించిన ఎందరో కార్మికులు ప్రస్తుతం సరైన జీవనోపాధి లేక గిట్టుబాటు కాకపోవడంతో ఈ వృత్తిని వదిలి వేరే వృత్తుల్లోకి వెళ్లిపోతున్నారు. కార్మికులకు ప్రభుత్వం తగినంత ప్రోత్సాహం అందించడం ద్వారా మరెందరో మరలా ఈ వృత్తిపై ఆకర్షితులయ్యే అవకాశం ఉందని తద్వారా సంస్థ మరింత అభివృద్ధి చెందుతుందని పలువురు పేర్కొంటున్నారు.



పొందూరు ఖాదీ బాండార్

కళ అంతరించిపోకుండా చూడాలి



పొందూరు ఖద్దరు ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. పొందూరు ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంస్థను గత ప్రభుత్వం లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డుతో ప్రత్యేకంగా గుర్తింపు ఇచ్చింది. ప్రస్తుత ప్రభుత్వం ఖద్దరు ప్రాధాన్యతను తెలియజేసే విధంగా వీడియో చిత్రీకరణ పోటీలను నిర్వహించింది. పత్తి నుంచి దారం తయారయ్యే ప్రక్రియ పూర్తిగా చేతితో చేసే ఈ కళ అంతరించి పోకుండా కాపాడుకోవాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉంది.

– గుంటుకు కామేశ్వర ప్రసాద్, అధ్యక్షులు, ఎఎఫ్‌కెకె సంఘం

ప్రభుత్వం ఆదుకోవాలి



గాంధీ సిద్ధాంతాలకు అనుగుణంగా నడుస్తున్న ఈ సంస్థను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి. చేనేత, ఖద్దరును వేర్వేరుగా చూడాలి. ముఖ్యంగా ఖాదీవస్త్రాల పేరుతో గల నకిలీలను అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– దండా వెంకటరమణ, కార్మిదర్శి, ఎఎఫ్‌కెకె సంఘం

సమగ్రాభివృద్ధి సాధనే లక్ష్యం

ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని పొందూరు, బూర్జ, సరుబుజ్జిలి, ఆమదాలవలస మండలాలతో పాటు మున్సిపాలిటీ పరిధిలో సమగ్ర అభివృద్ధి సాధనే తన లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. నియోజకవర్గంలో పలు సమస్యలు, వాటి పరిష్కారంపై ప్రజాశక్తితో ముచ్చటించారు. నియోజకవర్గంలో ప్రాథమిక స్థాయి నుంచి పీజీ స్థాయి వరకు విద్యావకాశాలు కల్పించడానికి ప్రత్యేక కృషి చేపడుతున్నానని, ఇప్పటికే ఆమదాలవలస



ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి ఐదు కోట్లు నిధులు మంజూరు చేయించానని, అలాగే పొందూరు, తొగరాం డిగ్రీ కళాశాలకు పూర్తిస్థాయి భవనాలు కల్పించడానికి చర్యలు చేపట్టడంతో పాటు పట్టణంలో ప్రభుత్వ ఐటిఐ ఏర్పాటుతో పాటు ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు కూడా కృషి చేయడం జరుగుతుందన్నారు. టిడిపి ప్రభుత్వం రైతుల పక్షపాతని ఇప్పటికే నియోజకవర్గంలో రైతులకు సాగునీరు అందించడానికి పలు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ ఐదేళ్ల పాలనలో నారాయణపురం, రెల్లిగెడ్డ, కొత్తగెడ్డ అభివృద్ధితో పాటు వంశధార, నాగావళి నదుల అనుసంధానం పూర్తి చేయడమే తన లక్ష్యమని తెలిపారు. రాష్ట్రంలో వైసిపి ఐదేళ్ల పాలనలో రహదారులు పూర్తిగా నిర్లక్ష్యానికి గురికావడంతో ప్రస్తుతం ఈ దుస్థితి ఏర్పడిందని ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రోడ్లు భవనాల శాఖ మంత్రి బిసి జనార్ధన్ రెడ్డిలతో పాటు రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను కలిసి రహదారుల అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకరించాలని కోరగా వారు కూడా నిధుల మంజూరుకు అంగీకరించడం జరిగిందన్నారు. ముందుగా శ్రీకాకుళం - ఆముదలవలస రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు.

అలాగే దూసి, జొన్నవలస పరిశ్రమలు ప్రైవేట్ రంగానికి చెందినవని. చక్కెర కర్మాగారాన్ని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తన స్వార్ధం కోసం ప్రైవేట్ వ్యక్తులకు ధారాధత్తం చేసి కార్మికులను రోడ్డున పడేయడం జరిగింది. ప్రస్తుతం తాను నియోజకవర్గంలో ఏదో ఒక పరిశ్రమ స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో కృషి చేస్తున్నాను. మున్సిపాలిటీ గ్రేడ్ మార్చుతామంటూ గత పాలకులు ఎన్నో తప్పుడు నిర్ణయాలతో ప్రజల నెత్తిన అధిక బారాలు మోపారు. అంతే కాకుండా రాజకీయ వ్యక్తిగత కారణాలతో ఎన్నికలు జరగకుండా కోర్టు కేసులను నమోదు చేయించడం కూడా జరిగింది. వీటన్నింటిని ఒక కొలిక్కి తీసుకువచ్చి త్వరలో ఒకప్పటి పాత మున్సిపాలిటీ స్థాయిలోనే ఎన్నికలకు వెళ్లడంతో పాటు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 23 వార్డుల్లో నెలకొన్న అన్ని సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటానని రవికుమార్ తెలిపారు.

రైతు అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతులకు శాస్త్ర సాంకేతిక రంగాల పరంగా రైతులకు అండగా కృషి విజ్ఞాన కేంద్రం పనిచేస్తుంది. జిల్లా కేంద్రంలోని 12 కిలోమీటర్ల దూరంలో ఆమదాలవలసలో కృషి విజ్ఞాన కేంద్రం 1985 జనవరి 1న ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి వారిచే స్థాపించారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందంతో గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు వ్యవసాయ పరిశోధన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడానికి పనిచేస్తుంది. వ్యవసాయంలో రైతులకు గ్రామీణ యువతకు, మహిళలకు వివిధ శిక్షణా కార్యక్రమాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తిని, ఆదాయాన్ని పెంపొందించే దిశగా పనిచేస్తుంది. కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధాన భవనం, శిక్షణ భవనం, అద్దెకు వ్యవసాయ యంత్ర పరికరాల నిర్వహణ భవనం, సీడ్ హబ్, భూసార పరీక్షల ప్రయోగశాల, గృహ విజ్ఞాన ప్రయోగశాల, రైతులు వ్యవసాయ మహిళలు, విస్తరణ కార్యకర్తలకు వివిధ విస్తరణ కార్యకలాపాలు నిర్వహించడానికి రైతుల వసతి గృహం వంటి మౌలిక సదుపా యాలు ఉన్నాయి. ఈ మౌలిక సదుపాయాలతో పాటు విన్నూతన వ్యవసాయ సాంకేతికతలను ప్రదర్శించడానికి షేడ్ నెట్ నర్సరీ, క్రాప్ మ్యూజియం, పుట్టగొడుగుల పెంపకం యూనిట్, పౌల్ట్రీ యూనిట్, వాతావరణ కేంద్రం, వర్మికంపోస్టు యూనిట్, అజోల్ల ఉత్పత్తి యూనిట్, ఎన్ఎడిఇపి కంపోస్టు, సమీకృత వ్యవసాయ విధానాల యూనిట్, చేపల చెరువు, పోషకాహార తోట, మిద్దె తోట, వంటి వాటిపై ప్రదర్శన యూనిట్లనూ కృషి విజ్ఞాన కేంద్రం నిర్వహిస్తోంది. డ్రమ్ సీడర్ టెక్నాలజీతో 650 ఎకరాల విస్తీర్ణంలో వరిని నేరుగా విత్తడం జరిగింది. 13 మండలాల్లో 380 మంది రైతులు ఈ సాంకేతికతను అవలంబించడం ద్వారా సాగు ఖర్చు తగ్గి దిగుబడి వల్ల రూ.9.75 లక్షలు అదనపు ఆదాయాన్ని పొందారు.



శక్తి, వనరులు పరిరక్షణపై సాంకేతికత – వరిలో దున్న కుండా మొక్కజొన్న సాగును 31, 600 ఎకరాల విస్తీర్ణంలో పండించాం. జిల్లాలో 32,650 మంది రైతులు ఈ సాంకేతికతను అవలంబించారు. భూమి తయారీ, నీటిపారుదల, దిగుబడి ప్రయోజనా లపై పొదుపు ద్వారా రూ.4,82,50,000 అధిక ఆదాయాన్ని పొందారు. వరిలో వ్యవసాయ కూలీల కొరత పరిష్కరించడానికి ఉత్పాదకతను పెంపొందించడానికి యాంత్రికరణ శ్రీవరి పద్ధతి 1100 ఎకరాల విస్తీర్ణంలో వేశారు. జిల్లాలో 300 మంది రైతులు 13 మండలాల్లో ఈ సాంకేతికతను అవలంబించారు. విత్తన, కూలీ ఖర్చు, విత్తన మోతాదు, దిగుబడి ప్రయోజనంపై పొదుపు ద్వారా అదనంగా రూ.23,16,250 అధిక ఆదాయాన్ని పొందారు.

అన్నపూర్ణ కృషి ప్రసార సేవ : ముందుగా నమోదు చేయబడిన 5000 మంది వినియోగదారులకు వివిధ అంశాలపై వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు వివిధ పంటల్లో సేద్య, సస్యరక్షణ, పంటల ధరలు మార్కెటింగ్ వివరాలు, ఇతర వ్యవసాయ సంబంధిత విషయాలపై సలహాలను సంక్షిప్త సమాచారం ద్వారా పంపించారు. టోల్ ఫ్రీ నంబరు 18004253141 ద్వారా రైతుల ప్రశ్నలకు, సందేహాలకు సమాధానాలు ఇస్తున్నారు.

ప్రధాన కార్యకలాపాలు

- పరిశీలన క్షేత్రాలు నిర్వహించడం
- ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాలను నిర్వహించడం
- రైతులకు గ్రామీణ యువతకు, మహిళలకు శిక్షణ కార్యక్రమాలు.
- వ్యవసాయశాఖ అనుబంధ రంగాలు, స్వచ్ఛంద సంస్థలకు వ్యవసాయ సాంకేతిక విస్తరణ కేంద్రంగా వ్యవహరిస్తుంది
- నూతన వంగడాలు, నారు ఉత్పత్తి, జీవ నియంత్రకాలు, వివిధ కీలక ఉపకరణాలను రైతులకు అందిస్తుంది.
- వ్యవసాయ, అనుబంధ రంగాల్లో సాంకేతికత విస్తరణకు వివిధ రకాల విస్తరణ కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

ఆ ఊరిలో వైద్యులే ఎక్కువ


కణుగులవలస గ్రామం (గ్రామ వ్యూ)

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణానికి కూతవేటు దూరంలో మండల పరిధిలో ఉన్న కణుగులవలసలో 93 మంది వైద్యులు వైద్య వృత్తిలో స్థిరపడి ప్రజలకు సేవలు చేస్తున్నారు. ఓ కుగ్రామం నుంచి వందల మంది వైద్య వృత్తిలో స్థిరపడడం సామాన్యమైన విషయమేమి కాదు. గ్రామంలోని ఓ పెద్దాయన ముందుచూపుతో వేసిన విద్య అనే విత్తనంతో గ్రామంలోని యువతీ, యువకులు బడిబాట పట్టి వైద్యులుగా, ఇంజనీర్లుగా వివిధ స్థాయిల్లో కొలువుల్లో స్థిరపడ్డారు. గ్రామంలో వ్యవసాయదారిత కుటుంబాలపై జీవించే తల్లిదండ్రులు కాయ కష్టం చేసి వారి పిల్లలను ఉన్నత స్థానాల్లో స్థిరపడేటట్లు చేయడంలో కృత కృత్యులయ్యారు. 650 ఇళ్లు ఉండే కణుగులవలసలో జనాభా సుమారు 3 వేల వరకు ఉండే ఆ పల్లె నుంచి విద్యావంతులై ఏకంగా 93 మంది వైద్యులుగా దేశ విదేశాల్లో సేవలందిస్తున్నారు. అలాగే గ్రామంలో మరికొంత మంది శాస్త్రవేత్తలుగా, పోలీసు ఉన్నతాధికారులుగా, ఉపాధ్యాయులుగా ఇలా అన్ని రంగాల్లో స్థిరపడ్డారు. ఒకానొకప్పుడు ఆ గ్రామం పూర్తిగా వెనుకబడిన ప్రాంతం. వర్షాలు పడితే పంటలు పండి నాలుగు మెతుకులు నోట్లోకి వెళ్లే పరిస్థితి. నేడు ఆ గ్రామం అందరికీ ఆదర్శ గ్రామంగా నిలిచింది. 1900 సంవత్సరంలో దివంగత బొడ్డేపల్లి రామమూర్తి మొట్టమొదట ఓ పాఠశాలను ప్రారంభించారు. అలా కణుగులవలసలో విద్యాబీజం నాటబడి వందల మంది ఉన్నత విద్యావంతులుగా ఎదిగేందుకు దోహద పడింది. ఆ తర్వాత క్రమంలో 1967లో గ్రామ పెద్ద ఇంటి వరండాలో నడిచే పాఠశాలకు అప్పటి మండల వైస్ ప్రెసిడెంట్ హోదాలో ఉండే స్వర్గీయ బొడ్డేపల్లి రామజోగ నాయుడు

కణుగులవలసలో 93 మంది వైద్యులు

కృషితో పాఠశాలను నిర్మించి ప్రతి తరగతికి ఒక గది, ఆ గదికి ఒక ఉపాధ్యాయుడు పనిచేసేటట్లు నియమించడంతో గ్రామంలో విద్యకు పునాది పడిందని చెప్పవచ్చు.

వైద్య రంగంలో తమదైన ముద్ర వేసిన వైద్యులు

తొలి తరంలో గుంటముక్కల అప్పన్న, అన్నాజీరావు ఆయుర్వేద వైద్యం అందించే వారు. అధికార్ల జగబంధు పశు వైద్యం చేసేవారు. అల్లోపతి వైద్యులుగా బెండి చంద్రశేఖరరావు, నూక భాస్కరరావు, నూక చంద్రశేఖరరావు సేవలందించేవారు. సంపదరావు శ్రీదేవి (ఎంఎస్ గైనకాలజీ), బొడ్డేపల్లి సూర్యారావు (ఎంఎస్ ఆర్తో), సీపాన గోపి, జయలక్ష్మి (న్యూరాలజిస్టులు), బెండి తేజేశ్వరరావు (ఎంఎస్ సర్జన్), సీపాన సోమశేఖర్ (ఎండి పీడియాట్రిక్స్), సీపాన రమేష్ (ఇఎన్‌టి), పంచాది శ్రీదేవి, బొడ్డేపల్లి సురేష్, శ్రీనివాసరావు తదితరులు వైద్య నిపుణులుగా స్థిరపడ్డారు. ఢిల్లీ ఎయిమ్స్‌తో పాటు ఇతర దేశాలతో పాటు దేశంలోని ప్రధాన నగరాల్లో వైద్యులుగా స్థిరపడ్డారు.చదువులోనే కాకుండా సామాజిక చైతన్యంలోనూ గ్రామస్తులు ముందుండేవారు. స్వాతంత్ర ఉద్యమంలో బెండి అప్పలసూరి అనేక నిర్బంధాలను ఎదుర్కొని సర్దార్ బిరుదు పొందారు. కణుగులవలస గ్రామం ఒకప్పుడు నక్సల్ బరి ఉద్యమ కేంద్రంగా ఉండేది. బొడ్డేపల్లి సంపూర్ణమ్మ, చౌదరి తేజేశ్వరరావు వంటివారు దళ నాయకులుగా పోరాటాల్లో పాల్గొని జైలు జీవితం గడిపిన వారే.

ఉన్నత స్థానాల్లో ఉన్నారు



తమ తండ్రి బెండి చిట్టెయ్య మాస్టారు 20 ఏళ్లు, సోదరుడు సూర్యనారాయణ మాస్టారు పదేళ్లు, తాను 20 ఏళ్లు గ్రామంలో విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాం. తమ దగ్గర విద్యాబుద్ధులు నేర్చుకున్న విద్యార్థులు వైద్యులుగా, ఉపాధ్యాయులుగా స్థిరపడి ఉన్నత స్థానాల్లో కొలువు తీరడం తనకెంతో ఆనందంగా ఉంది. అప్పుడప్పుడు తన శిష్యుల చేస్తున్న సేవలు పలువురు చర్చించుకుంటుంటే ఆనందానికి అవధులు లేకుండా పోతుంది.

- బెండి కృష్ణారావు,
విశ్రాంత మండల విద్యాశాఖాధికారి


నాడు-నేడు కింద నూతనంగా నిర్మించిన పాఠశాల

పెద్దలు, గురువుల ప్రోత్సాహం



నాటి పెద్దల ప్రోత్సాహం, గురువుల ప్రోద్బలం కలిపి మాలో చదువుకోవాలన్న ఆశ పెరిగి విద్య వైపు అడుగులేసి విద్యావంతులమయ్యాం. ఆ రోజుల్లో ఒక పూట తిని మరో పూట పస్తులుండి తమ తల్లిదండ్రులు తమను చదివించారు. చాలా ఆనందంగా ఉంది.

- బొడ్డేపల్లి జనార్ధనరావు,
విశ్రాంత ఉపాధ్యాయులు, జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షులు

దశాబ్దాలుగా కానరాని సౌకర్యాలు

- **అనునిత్యం తప్పని అవస్థలు**
- **పట్టించుకోని అధికారులు**

ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా తమ తలరాతలు మాత్రం మారడం లేదని గిరిజనలు ఆవేదన చెందుతున్నారు. నేతలు మారుతున్న ప్రతిసారి తమ గ్రామం అభివృద్ధి చెందుతుందని, సకల సౌకర్యాలు కలుగుతాయని ఎంతో ఆశతో ఉన్నవారికి ప్రతిసారీ నిరాశే ఎదురవుతుంది. కనీస సౌకర్యాల కోసం అటు పాలకులు చుట్టు అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఫలితం శూన్యమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి


ప్రజాశక్తి- బూర్జ

ప్రభుత్వాలు, పాలకులు మారిన ప్రతిసారి గిరిజన గ్రామాలను తద్వారా గిరిజనులను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు ఎన్నో పథకాలను, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ఊక దంపుడు ఉపన్యాసాలు గుప్పిస్తున్నారే తప్ప నేతలు తమ గ్రామం వైపు కన్నెత్తి కూడా చూడకపోవడం శోచనీయమని ఆ గ్రామస్తులు విమర్శిస్తున్నారు. మండ లంలోని పాలవలస పంచాయతీ పరిధిలోని ఉన్న కొత్తవలస గిరిజన గ్రామంలో సమస్యలు తీవ్రంగా వేధిస్తున్నాయి.

సుమారు ఏడు దశాబ్దాల కిందట ఏర్పడిన ఈ కొత్తవలస గిరిజన గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో అటు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు కూడా పూర్తిగా విఫలమయ్యారని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

తాగునీటికి కటకట

గ్రామంలో తాగునీరు కోసం అనునిత్యం అవస్థలు తప్పడం లేదు. దశాబ్దాల క్రితం నిర్మించిన బావి నీరే అన్నింటికీ ఆధారమని, అయితే ఇంతవరకు సంబంధిత అధికారులు ఈ బావిని శుభ్రపరచిన దాఖలాలు లేవని, గ్రామంలోని అన్ని కుటుంబాలకు ఆధారమైన బావిని శుభ్రపరచక పోవడంతో తాగేందుకు కూడా నీళ్లు కలుషితమైపోయాయని గ్రామస్తుల వాపోతున్నారు.


తాగునీటి బావి పరిస్థితి

చదువులు దూరం

గ్రామంలో ఇంతవరకు పాఠశాల లేకపోవడంతో తమ పిల్లలను రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తుడ్డలి గ్రామానికి పంపిస్తున్నామని తల్లిదండ్రులు తెలిపారు. అలాగే అంగన్వాడీ కేంద్రం కూడా లేక అవస్థలు ఎదుర్కొంటున్నామన్నారు. ముఖ్యంగా ఐదో తరగతి తర్వాత తమ పిల్లలను దూర ప్రాంతంలో ఉన్న వసతిగృహాల్లో జాయిన్ చేస్తున్నామని, మరి కొంతమంది పెద్దలకు దూరమై ఇంటి వద్దనే ఉండి పోవాల్సిన పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు.

రహదారి లేక అవస్థలు

తమ గ్రామానికి రహదారి లేకపోవడంతో అత్యవసర సమయంలో అవస్థలు తప్పడం లేదు. గ్రామానికి 108, 104 వంటి వాహనాలు రావడానికి కూడా అవకాశం లేదని, అత్యవసర సమయంలో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి ఎదురవుతుందని గిరిజనులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకవర్గం స్పందించి తమ గ్రామంలో తిష్ట వేసిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి



తమకు ఊహ తెలిసిన తర్వాత ఇంతవరకు ఎటువంటి సదుపాయాలు, సౌకర్యాలు కల్పించిన పాపాన పోలేదు. సమస్యలతో సతమతం అవుతున్నాం. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

- నిమ్మక జ్యోతి, కొత్తవలస

కలుషిత నీటితో అవస్థలు



కలుషిత నీటిని సేవించడంతో పలు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. తాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా గ్రామంలో పాఠశాల, అంగన్వాడీ భవనం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

- నిమ్మక జయమ్మ, కొత్తవలస


కాలువలు లేని కొత్తవలస గిరిజన గ్రామం



ముళ్లపొదలు, పిచ్చిమొక్కల మధ్య నిరుపయోగంగా ఉన్న అమరావతి పార్కు

ఆహ్లాదం కరువాయే...

గాలికొదిలేసిన ఉద్యానవనాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

నగరాన్ని అందాలవలసగా తీర్చిదిద్దుతామని పట్టణంలోని పెద్ద చెరువులో బోటు షికారును ఏర్పాటు చేసి ఆహ్లాదాన్ని అందిస్తామని పదే పదే వైసిపి ఓ మాజీ సీనియర్ నేత చెప్పేవారు. బోటు షికారు మాట అటు ఉంచితే పట్టణంలో అప్పటికే ఉన్న ఉద్యానవనాలను పట్టించుకోకుండా గాలికి వదిలేశారు. 2019లో వైసిపి అధికారంలోకి వచ్చాక ఉద్యానవనాల నిర్వహణ మాటే మరిచారు. పట్టణం అంటే ఆధునిక వసతులు మౌలిక సౌకర్యాలతో పాటు విశ్రాంతి తీసుకునేందుకు పార్కులు, ఆట స్థలాలు తదితర వసతులు సమకూర్చుతారు. 2019 ముందు వరకు పట్టణంలో ఐదు ఉద్యానవనాలు ఉండేవి. పట్టణంలో బిఆర్ నగర్‌లో అమరావతి పార్క్, మోణింగి వారి వీధిలో భగత్ సింగ్ నెహ్రూ పిల్లల ఉద్యానవనాలు, రామలింగేశ్వర పార్క్, పారిశ్రామిక వాడ వద్ద ట్రయాంగిల్ పార్క్, వెంకయ్య పేటలో కోనేరు ఉద్యానవనాలు ఉండేవి. ఒకానొకనాడు జనావాసాలతో అందంగా ఆహ్లాదంగా ఉండే ఉద్యానవనాలు నేడు మురికి కూపాలుగా గంజాయి బ్యాచ్‌కు అడ్డాగా మారాయి. ఉద్యానవనాలలో విద్యుత్ సరఫరా లేకపోవడం, విష సర్పాలకు నిలయాలుగా మారడంతో ప్రజలు ఎవరు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. గతంలో సాయంత్రం అయ్యేసరికి జనాలతో కళకళలాడేవి. గతంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ఉద్యానవనాల్లో పిల్లల ఆట వస్తువులు, కూర్చోడానికి బెంచీలు, నడక ట్రాక్లు, వివిధ రకాల మొక్కలను పెంచి ఆహ్లాదకరంగా తయారు చేశారు.


శిథిలమైన నెహ్రూ విగ్రహం


తుప్పల నడుమ బెంచీ

2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉద్యానవనాల నిర్వహణను గాలికి వదిలేయడంతో అసాంఘిక కార్యకలాపాలకు, జంతువులకు ఆవాసాలుగా ఉద్యాన వనాలు మారాయి. ఉద్యానవనాల్లోకి అడుగుపెడితే ముళ్లపొదలు, పాముల పుట్టలు ప్రస్తుతం దర్శనమిస్తుండడంతో పట్టణవాసులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. పెద్దలు, పిల్లలు ఆటవిడుపు ఆహ్లాదానికి దూరంగా ఉండాల్సి వస్తుందంటూ పురవాసులు వాపోతున్నారు. చిన్నారుల పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత ఉద్యానవనంలో గడిపే సమయం వారి మానసిక వికాసానికి దోహదపడుతుందని పలువురు చెబుతున్నారు. పార్కుల నిర్వహణపై మున్సిపల్ అధికారులకు ఉన్న చిత్తశుద్ధి ఏమిటో ఈ ఉద్యానవనాలను చూస్తే అర్థమవుతుందని పలువురు సీనియర్ సిటిజన్లు పెదవి విరుస్తున్నారు.


పిచ్చిమొక్కల మధ్య వాకింగ్ ట్రాక్

పట్టణంలో పిల్లలు ఆడుకునేందుకు, పెద్దలు వ్యాహ్యాళికి చెప్పుకోదగిన పార్కు ఒక్కటి లేకుండా పోవడం పట్టణ వాసుల దౌర్భాగ్యమని పలువురు అధికారులు నాయకుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. దైనందిన జీవితంలో బిజీబిజీగా గడిపే ప్రజలు సాయంత్రం వేళ సేద తీరేందుకు సరైన ఉద్యాన వనాలు లేక ఉన్న పార్కుల పరిస్థితి అధ్వానంగా ఉండి వాటి నిర్వహణను పురపాలక సంఘ అధికారులు గత కొన్నేళ్లుగా విస్మరించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు అధికారులు చిత్తశుద్ధితో కృషి చేసి ఉద్యానవనాలను అభివృద్ధి చేయాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.



కళావిహీనంగా మారిన నెహ్రూ చిల్డ్రన్ పార్కు


పిచ్చి మొక్కలు, పుట్టల మధ్య బుద్ధుని విగ్రహం


కనుమరుగైన పిల్లల ఆట వస్తువులు

ఆన్‌లైన్‌లో ఆటలు.. అప్పులతో తిప్పలు

- తొలుత సరదాగా మొదలు
- ఆ తరువాత వ్యసనంగా మారుతున్న వైనం
- రూ.పదితో ప్రారంభమై రూ.లక్షల్లో...

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సులభంగా డబ్బు సంపాదించాలనే అత్యాశతో చాలామంది ఆన్‌లైన్ ఆటలకు ఆడుతున్నారు. మొదట సరదాగా, కాలక్షేపం కోసం మొదలుపెట్టిన వారూ చివరకు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా విద్యార్థులు, యువకులు, మధ్య తరగతి వ్యక్తులు వీటితో నష్టపోతున్నారు. కొందరు త్వరలోనే తేరుకుని దూరమవుతుంటే... చాలామంది అప్పుల పాలవుతున్నారు. ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా..ఆ మదాలవలస మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు ఆన్‌లైన్ ఆటలకు బానిసయ్యాడు. కాలక్షేపానికి మొదట రూ.10తో మొదలు పెట్టి రూ.వేలల్లో నష్టపోయాడు. స్నేహితులు, బంధువుల వద్ద రూ.1.50 కోట్లకు పైగా అప్పులు చేశాడు. ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గార మండలం కళింగపట్నంకు చెందిన ఓ వ్యక్తి నగరంలోని కార్పొరేట్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించేవాడు. నగరంలోనే నివాసం ఏర్పరచుకుని భార్య, ఇద్దరు పిల్లలతో



సంసారం ఉన్నంతలో సాఫీగా సాగిపోయేది. ఆన్‌లైన్ ఆటకు మొబైల్ ఫోన్‌లో ఆడడం మొదలు పెట్టాడు. రోజురోజుకూ ఈ ఆట అలవాటుగా మారి తర్వాత వ్యసనంగా మారింది. దొరికిన వారి దగ్గర అధిక వడ్డీలకు అప్పులు చేశారు. కార్పొరేటు స్కూల్‌లో తోటి ఉపాధ్యాయులను వదలకుండా రూ.కోట్ల మొత్తంలో అప్పులు చేసి చివరకు ప్రిన్సిపాల్ పోస్టును వదిలి అందరికి ముఖం చాటేశాడు. కాలేజీ, స్కూల్ స్థాయి విద్యార్థులు ఈ గేమ్‌ల్లోనే బెట్టింగ్‌లు ఇతర వ్యసనాలకు గురవుతున్నారు. తల్లిదండ్రుల మాటను సైతం లెక్క చేయకుండా ఒత్తిడికి గురై చివరకు అర్థాంతరంగా చదవును వదిలి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఇంటర్‌నెట్‌లో ఆన్‌లైన్ ఆటలు చాలానే ఉన్నాయి. తొలుత పెట్టిన డబ్బులకు రెట్టింపు వచ్చేలా చూస్తారు. రెండు, మూడు దఫాలు అదనంగా డబ్బు రావడంతో అత్యాశకు పోతున్నారు. ఒకరితో ఒకరికి సంబంధం లేకుండా సెల్ ఫోన్‌లోనే ఇంటర్‌నెట్ సాయంతో ఆట సాగుతుంది. ఆటలో గెలిస్తే ఆ మొత్తంలో 15 శాతం వరకు కమీషన్ రూపంలో ఆన్‌లైన్ కంపెనీ లాగేసుకుంటుంది. సులువుగా డబ్బు సంపాదించవచ్చనే ఆశతో ఆన్‌లైన్ ఆటల పుణ్యమా అని జిల్లాలో ఇలాంటి అఘాయిత్యాలు చోటు చేసుకుంటున్నాయి. డబ్బులు పోగొట్టుకున్న వారు కేసులకు భయపడి మిన్నకుండిపోతున్నారు. అప్పులు చేసి మరీ ఆడుతున్న వారు కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. సులువుగా డబ్బు సంపాదించ వచ్చనే ఆశతో రూ.10తో మొదలుపెట్టి రూ.లక్షల్లో అప్పులు చేస్తున్నారు. పోగొట్టుకున్న సొమ్ములు రాబట్టుకోవడానికి రూ.వేలు, లక్షలు పెడుతూ తీరం దొరకని నావలా ఆట సాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ ఆటలను కొన్నింటిని నిషేధించింది. కొన్ని యాప్‌లు, ఇతర రాష్ట్రాల ఐపి (ఇంటర్నెట్ ప్రొటోకాల్) ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని తప్పు దోవపడుతున్నారు. ఆన్‌లైన్ అనుమతులున్న రాష్ట్రాల్లో ఉంటున్నట్లుగా చూపుతూ అక్రమంగా ఆట మొదలుపెడుతున్నారు. కొన్ని ఆటలకు పాన్ నంబరు, బ్యాంకు ఖాతా, మెయిల్ ఐడి తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. ఇవే ఒక్కో సారి సైబర్ నేరాలకు దారితీస్తున్నాయి. దీనివల్ల జిల్లాలో ఏటా రూ.కోట్ల మేర ప్రజలు నష్టపోతున్నారు. ఈ యాప్‌లు, ఆటల జోలికి పోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

పేర్లు రెండు... గ్రామం ఒకటి

రికార్డుల్లో ఒకటి... వాడుకలో మరొకటి

ప్రజాశక్తి- పొందూరు

గ్రామం ఒకటే అయినా రెండు పేర్లతో పిలవడం ఆనవాయితీగా మారింది. తెలియనివారు వచ్చి ఆ గ్రామం అసలు పేరు చెబితే అదెక్కటుందీ అంటూ స్థానికులే కొందరు ఆశ్చర్యపోతూ ఉంటారు. గ్రామ ప్రజలు మధ్యలో ఏర్పాటు చేసుకున్న పేరు చెబితేనే అర్థం చేసుకుంటారు. ఇది



ఆమదాలవలస మండలం గట్టుముడిపేటలో అంగన్‌వాడీ భవనంపై వంజంగిపేట పేరు

ఆమదాలవలస నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల పరిస్థితి.

ఆమదాలవలస మండలంలో...

ఆమదాలవలస మండలంలోని వంజంగిపేటకు రెండు పేర్లు ఉన్నాయి. ఈ గ్రామంలో గతంలో గట్టుముడిపేట ఇంటిపేరు వారు అధికంగా ఉండేవారు. అయితే ప్రస్తుతం గ్రామంలో ఒక్క కుటుంబమూ లేకపోవడంతో గ్రామం పేరు వంజంగిపేటగా పేరు పెట్టారు. గ్రామానికి సమీపంలో వంజంగి గ్రామం ఉండడంతో వంజంగిపేట అనే పేరుతో ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేశారు. కానీ, పూర్వ నిర్మించిన భవనాలపై గట్టుముడిపేట అని రాసి ఉంది. ప్రస్తుతం నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలపై వంజింగిపేట అని రాస్తున్నారు.

ఆమదాలవలస సమీపంలోని ఉన్న శ్రీహరిపురం అనే గ్రామాన్ని మూలవానిపేట అనే పేరుతో పిలుస్తున్నారు. ఆ గ్రామంలో మూల అనే ఇంటిపేరు కలిగిన ఉన్నారు. కానీ, ద్రస్తాల్లో మాత్రం శ్రీహరిపురంగానే రాస్తుంటారు. పాత భవనాలపై మూలవానిపేట అని ఉండగా, కొత్తగా నిర్మాణం జరిపే భవనాలపై శ్రీహరిపురంగానే రాస్తున్నారు. చాలా మందికి మూలానిపేట అంటేనే తెలుస్తుంది.

మండలంలోని గొద్దుపేట గ్రామాన్ని హనుమంతుపురం అనే పేరుతో పిలుస్తున్నారు. గతంలో గ్రామంలో గొద్దు అనే ఇంటి పేరు కలిగినవారు ఎక్కువుగా ఉండేవారు. ప్రస్తుతం ఆ ఇంటిపేరు కలిగిన పలు కుటుంబాలు ఉన్నప్పటికీ పేరు బాగోలేదని మార్చారు. గ్రామంలో కొన్ని సంవత్సరాలు కిందట ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఆ గ్రామాన్ని హనుమంతుపురంగా పిలుస్తూ ప్రభుత్వ దస్త్రాల్లో ఆ విధంగా రాస్తున్నారు.

మండలంలోని సీపాన చంద్రయ్యపేట గ్రామాన్ని కొండపేట అనే పేరుతో పిలుస్తున్నారు. గతంలో ఈ ప్రాంతంలో కొండలు ఉండడంతో కొండల మధ్య గ్రామం కావడంతో కొండపేట అని పిలిచేవారు. అయితే కొండలను పేల్చిరాయిని తరలించడంతో ఆ ప్రాంతంలో కొండలు లేకుండా పోయాయి. దీంతో గ్రామంలో సీపాన అనే ఇంటిపేరుగల వారు ఎక్కువుగా ఉండడంతో సీపాన చంద్రయ్యపేట అనే పేరుతో ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేసుకున్నారు.

ప్రకృతి సిగలో సిక్కోలు సోయగాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

పేదల ఊటీగా పిలిచే సిక్కోలు ప్రకృతి సోయగాలకు నెలవు. సుదీర్ఘ సముద్ర తీరం... క్రీస్తు పూర్వం నాటి ఘన చరిత్ర... అతి ప్రాచీన, అరుదైన దేవాలయాలు.. బౌద్ధారామ క్షేత్రాలు... అపార ప్రకృతి వనరులు... ఇవీ శ్రీకాకుళం జిల్లా స్వరూపం.

నాగావళి, వంశధార, మహేంద్రతనయ, బహుదా నదుల సాగర సంగమ ప్రదేశాలు... కోనసీమను తలపించే ఉద్దానం... ఇలా చెప్పుకుంటూ పోతే సిక్కోలు సిగలో ఎన్నో... మరెన్నో...



ఉద్దానం.. మరో కోనసీమ

శ్రీకాకుళానికి 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న కవిటి ఉద్దాన ప్రాంతం మరో కోనసీమ. దట్టమైన జీడిమామిడి, కొబ్బరి తోటలతో ప్రకృతి అందాలకు నిలయంగా ఉంది. అందమైన ఉద్యానవనంగా ఈ ప్రాంతం ఉండడంతో క్రమంగా ఉద్దానంగా రూపాంతరం చెందింది. పనస, ఇతర పండ్ల తోటలు ఉద్దానంలో చాలా ఎక్కువ.

విదేశీపక్షుల విడిది కేంద్రం.. తేలినీలాపురం

తేలినీలాపురం పేరు చెప్తేనే ముందుగా గుర్తుకొచ్చేవి సైబీరియా పక్షులు. ఫెలికాన్, పెయింటెడ్, స్టార్క్స్ జాతి పక్షులు 12 వేల మైళ్ల దాటి ఏటా సెప్టెంబరులో ఇక్కడకు చేరుకుంటాయి. ఇక్కడే గుడ్లు పెట్టి, పొదిగాక పెద్దయిన పిల్లలతో కలిసి తిరిగి స్వస్థలానికి వెళ్ళిపోతాయి.

సాగరతీరం... కళింగ పట్టణం



శ్రీకాకుళం పట్టణానికి 25 కిలోమీటర్ల దూరంలో గార మండలంలో కళింగపట్టణం ఉంది. ఇది తీరప్రాంత పట్టణం. కళింగపట్టణం అంటేనే అందమైన బీచ్, లైట్‌హౌస్ మదిలో మెదులుతాయి. కళింగపట్టణానికి కిలోమీటరు దూరంలో షేక్‌మదీనా దర్గా ఉంది. ఇక్కడ హిందువులు, ముస్లిములు పూజలు చేస్తూ సర్వమత సహనానికి ప్రతీకగా నిలుస్తున్నారు. ఈస్టిండియా కంపెనీ పాలనా కాలంలో ఇక్కడ మైనర్ కోర్టు ఉండేది.

ప్రకృతి అందాల సోయగం.. బారువ తీరం

జిల్లాలో సువిశాలమైన ఇసుక తిన్నెలు కలిగిన బారువా తీరం పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తోంది. రెండో ప్రపంచయుద్ధానికి ముందు ఇక్కడ ఓడరేవు ఉండేది. ఎన్నో ఆలయాలు ఉండేవి. కనుచూపుమేర ఇసుక తిన్నెలతో ప్రకృతి పిండారబోసినట్లు ఉంటుంది. సముద్ర స్నానానికి ఇది అనువైన ప్రాంతం. మహేంద్రతనయ నది సాగర సంగమంతోపాటు ఏపుగా ఎదిగిన కొబ్బరితోటలు ప్రకృతి శోభకు ప్రత్యేక అందాన్నిస్తుంటాయి. బారువలో కోటిలింగేశ్వర, జనార్ధన, జగన్నాథ ఆలయాలతో పాటు మరో పది దేవాలయాలున్నాయి. సముద్రతీరంలో పంచాయతీరాజ్ అతిథిగృహంతో పాటు పర్యాటక కాటేజీలున్నాయి. కార్తీకమాసంలో సముద్ర స్నానాల కోసం ఇక్కడకు పలు ప్రాంతాల నుంచి వేలాది మంది వస్తుంటారు.

మొగదలపాడు బీచ్

శ్రీకాకుళం పట్టణానికి 20 కిలోమీటర్ల దూరంలో గార మండలంలో ఉన్న మొగదలపాడు బీచ్ సందర్శకులను ఎక్కువగా ఆకర్షిస్తోంది. రెండు దశాబ్దాల కిందట సముద్రంలోకి నిర్మించిన పొడవాటి వంతెన ప్రత్యేక ఆకర్షణగా ఉంటూ సందర్శకులను కనువిందు చేస్తోంది. తీరం నుంచి సుమారు 200 మీటర్ల పొడవునా ఈ వంతెన ఉంది. కార్తీకమాసంలో వేలాది మంది కుటుంబాలతో సహా ఇక్కడకు వచ్చి వన భోజనాలు చేస్తుంటారు. ఉవ్వెత్తున ఎగిసిపడిన సముద్రపు అలలు వంతెన స్తంభాన్ని తాకుతూ పర్యాటకులను పరవశింప చేస్తుంటాయి. విశ్రాంతి గృహాలు లేకపోయినా ఇక్కడున్న సరుగుడు, జీడితోటలు సందర్శకులను సేదతీరేందుకు నీడనిస్తున్నాయి.

భావనపాడు బీచ్

సంతబొమ్మాళి మండలం భావనపాడు బీచ్ పర్యాటకులకు ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇక్కడ నిర్మాణంలో నిలిచిపోయిన ఫిషింగ్ హార్బర్ సందర్శకులకు సేదతీరేందుకు అనువుగా ఉంటుంది. సముద్రం లోపలి భాగానికి డ్రెడ్జింగ్ కోసం వేసిన రాతిగట్టు పర్యాటకులను ఆకట్టుకుంటుంది. తీరం వెంబడి ఉన్న జీడిమామిడి తోటలు ప్రత్యేక అందాలతో ఉంటాయి.





పరిఢవిల్లిన చారిత్రక సంపద

సిక్కోలు పేరు చెప్తే ముందుగా గుర్తుకొచ్చే చారిత్రక ప్రదేశాలు శాలిహుండం, దంతపురి. బౌద్ధమతం జిల్లాలో ఎంతగా పరిఢవిల్లిందో ఈ ప్రాంతాల్లో జరిపిన తవ్వకాల్లో లభించిన పురాతన సంపదే చాటిచెప్తోంది. జిల్లాలో శతాబ్దాల పాటు బౌద్ధమతం భాసిల్లిందనడానికి చారిత్రక ఆధారాలు ఎన్నో ఉన్నాయి. ఒక్క బౌద్ధమతమే కాదు... జైనమతానికి సంబంధించిన పురాతన విగ్రహాలకూ సిక్కోలు నిలయం.



దంతపురి

శ్రీకాకుళానికి 21 కిలోమీటర్ల దూరంలో అలికాం-బత్తిలి రహదారి నుంచి రొట్టవలస గ్రామానికి తూర్పు దిశలో ఉన్న కోట ప్రాంతాన్ని దంతపురి, దంతవరపుకోట పేర్లతో పిలుస్తారు. ప్రాచీన కళింగ సామ్రాజ్యానికి రాజధానిగా వెలుగొందిన దంతపురికి ఘన చరిత్ర ఉంది. సుమారు 500 ఎకరాల విస్తీర్ణం చుట్టూ 50 అడుగుల వెడల్పు, 20 అడుగుల ఎత్తు కలిగిన మట్టి గోడలు ఆనాటి కోటకు ఆనవాళ్లుగా ఇప్పటికీ ఉన్నాయి. దంతపురానికి అనుబంధంగా మూడు కోటలు, ఒక దుర్గం ఉండేవని చెప్తారు. కోటలున్న స్థానంలో నిర్మించిన గ్రామాలనే కొత్తకోట, ధనుకోట, పెద్దకోటగా పిలుస్తున్నారని చెప్తారు. కరకవలసలోని దుర్గంలో ఇప్పటికీ ప్రతిఏటా ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. దంతవరపు కోటకు ఎనిమిది ద్వారాలు ఉండేవని, ఆ ప్రాంతాల్లోనే కాలక్రమేణా రావివలస, రొట్టవలస, అవతారబాద్, మునగవలస, చిన్నపాలెం, పెద్దపాలెం, పాలవలస, కొండవలస గ్రామాలు వెలిశాయి. రైతులు బావి తవ్వినప్పుడు రకరకాలైన కూజాలు, మట్టిపాత్రలు, మెరిసే నలుపు, ఎరుపు రంగు పెంకులు, మట్టిపూసలు, బంగారు ఆభరణాలు లభించాయి.

బుద్ధుని దంతం ఉన్న ప్రాంతం కనుక దంతపురి అనే పేరు వచ్చిందని చరిత్రకారులు చెప్తున్నారు. ఈ ప్రాంతంలో జైన మతమూ వర్ధిల్లినట్లు ఆధారాలున్నాయి. ఇక్కడ ఒకప్పుడు బౌద్ధమతం పరిఢవిల్లిందనడానికి సాక్ష్యంగా బౌద్ధ స్తూపాలు బయటపడ్డాయి. 2010లో పలువురు బౌద్ధ భిక్షువులు ఈ ప్రాంతాన్ని సందర్శించి బౌద్ధులకు చెందిన పవిత్ర ప్రదేశంగా దంతపురిని పేర్కొనడం దీని ప్రాముఖ్యతకు నిలువెత్తు నిదర్శనం.

శాలిహుండం



శ్రీకాకుళం పట్టణానికి 18 కిలోమీటర్ల దూరంలో గార మండలంలోని శ్వేతపర్వతంపై ఉన్న పవిత్ర బౌద్ధ యాత్రా స్థలం శాలిహుండం. శాలిహుండం అంటే ధాన్యం గాదె అని అర్థం. బౌద్ధ భిక్షువులు ఆహారధాన్యాలను నిల్వ చేసుకునే కేంద్రంగా శాలిహుండం ఉండడంతో ఈ పేరు వచ్చిందని చెప్తారు. కళింగ రాజుల కాలంలో బౌద్ధమతం ఈ ప్రాంతంలో వ్యాప్తి చెందిందనడానికి శాలిహుండం ఒక నిదర్శనం. ఇక్కడ పలు విలువైన విగ్రహాలు, బౌద్ధ స్తూపం, బౌద్ధ చైత్యం బయటపడ్డాయి. పురావస్తుశాఖ వాటిని భద్రపరచడానికి చిన్న మ్యూజియంను ఏర్పాటు చేసింది. ఈ శాలిహుండం కొండ పక్కగా వంశధార నది ప్రవహిస్తుంది. వంశధార నది కళింగపట్టణం వద్ద బంగాళాఖాతంలో కలిసే దృశ్యం ఇక్కడ్నుంచి చూస్తే లీలగా కనిపిస్తుంది.

బౌద్ధమత వ్యాప్తి కేంద్రంగా, బౌద్ధ సంస్కృతికి నిలయంగా శాలిహుండం పేరుగాంచింది. ఇక్కడ బౌద్ధమతానికి సంబంధించిన ఎన్నో అవశేషాలు ఇప్పటికీ మిగిలి ఉన్నాయి. 50 ఏళ్ళ కిందట జరిపిన తవ్వకాల్లో అపురూపమైన శిల్ప సంపద, చారిత్రక అవశేషాలు బయటపడ్డాయి. బౌద్ధ విగ్రహాలు, స్తూపాలు, మహా చైత్యం, భిక్షువులు వాడే పాత్రల నమూనాలతో పాటు మూడు తలలు, ఆరు చేతులు గల ఛాయాదేవి విగ్రహం, మరీచి, మంజుశ్రీ, జంబాల, జడధారిణి, తార విగ్రహాలు లభించాయి.

బౌద్ధ స్తూపాలు

ఈ ప్రాంతాల్లో పురాతత్వశాఖ జరిపిన తవ్వకాల్లో మూడు బౌద్ధ స్తూపాలు బయటపడ్డాయి. ఇంకా తవ్వకాలు చేపడితే మహా స్థూపం బయటపడుతుందని, అదే జరిగితే దంతపురికి ప్రపంచస్థాయి గుర్తింపు లభిస్తుందని స్థానికులు ఆశిస్తున్నారు. 2002 జూన్ పదో తేదీ నుంచి మూడు రోజుల పాటు ఇక్కడ ఉత్సవాలు నిర్వహించారు. అప్పట్లో కోట మధ్య ప్రాంతంలో బుద్ధుని ఏకశిల విగ్రహాన్ని ప్రతిష్టించారు.



శాలిహుండం కొండపైన గుర్తించిన బుద్ధుని విగ్రహం

దేవతల రాతి విగ్రహాలు

దంతపురిలో పలు దేవతల రాతి విగ్రహాలున్నాయి. నడుం వరకూ విరిగి ఉన్న విగ్రహం చాముండేశ్వరిదని స్థానికులు చెప్తున్నారు. కంఠాభరణం, దండాభరణం, కపాలాలతో కనిపిస్తున్న ఇలాంటి రాతి విగ్రహం రాష్ట్రంలో మరెక్కడా లేదని పురావస్తుశాఖ అధికారులు పేర్కొన్నారు. అష్ట భుజాలతో కంఠాభరణాలు, కర్ణాభరణాలు, కాళ్లు చేతులకు కడియాలున్నట్లు కనిపిస్తున్న విగ్రహం మహిషాసురమర్ధనిగా గుర్తించారు.

ప్రాచీన ఆలయాలకు పుట్టినిల్లు సిక్కోలు

అతి ప్రాచీన, అత్యంత అరుదైన దేవాలయాలకు సిక్కోలు పుట్టినిల్లు. ప్రభాతవేళ భానుడి లేలేత కిరణాలు ఆదిత్యుని తాకే ఏకైక సూర్య దేవాలయం అరసవల్లి. దేశంలో ఎక్కడా లేని విధంగా రెండు ధ్వజస్తంభాలను కలిగి ఉన్న శ్రీకూర్మనాథ క్షేత్రం. దేశంలోనే ముఖాకృతి కలిగిన ఏకైక ఆలయం శ్రీముఖలింగం. ఈ ఆలయాల్లో కుడ్య చిత్రాలు, శిల్పకళా సౌందర్యాన్ని చూసి తీరాల్సిందే. శ్రీముఖలింగంలో ఆనాడే అత్యంత సూక్ష్మస్థాయిలో శిల్పాలను చెక్కిన తీరు మహాద్భుతం.

అరసవల్లి

శ్రీకాకుళం పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో శ్రీ ఉషాపద్మినిఛాయా సమేత శ్రీసూర్యనారాయణ స్వామి దేవాలయం ఉంది. భారతదేశంలోనే అరసవల్లి ఏకైక సూర్యదేవాలయంగా ప్రసిద్ధి చెందింది. దేవాలయం పక్కనున్న సూర్యగుండాన్ని 11వ శతాబ్దంలో తవ్వినట్లు చెప్తారు. ఈ దేవాలయాన్ని గంగరాజులు నిర్మించి పోషించారు. ఆదిత్యుని ఆలయంలోనే ఐదు ద్వారాల నుంచి ఏటా రెండు పర్యాయాలు మార్చి తొమ్మిదో తేదీ నుంచి 12వ తేదీ వరకు... అక్టోబరు 1, 2, 3 తేదీల్లో ఉదయం సూర్య కిరణాలు నేరుగా ఆదిత్యుని తాకడం విశేషం.





శ్రీముఖలింగం

శ్రీకాకుళానికి 48 కిలోమీటర్ల దూరంలో వంశధార నదీ తీరాన జలుమూరు మండలంలో శ్రీముఖలింగం ఉంది. దేశంలో మరెక్కడా శివలింగానికి ముఖాకృతి ఉండదు. శ్రీముఖలింగేశ్వరునికి ముఖాకృతి ఉండడం ఇక్కడి ప్రత్యేకత. ఈ ఆలయాన్ని 'దక్షణ కాశీ'గా పేర్కొంటారు. అత్యంత ప్రాచీన చరిత్ర ఈ క్షేత్రం సొంతం. ఇక్కడ సోమేశ్వరాలయం, భీమేశ్వరాలయం, మధుకేశ్వరాలయాలను క్రీస్తుశకం 573లో పూర్వగంగావంశానికి చెందిన హస్తివర్మ నిర్మించినట్లు చెప్తారు. మధుకేశ్వర, భీమేశ్వరాలయాలు తూర్పు చాళక్యుల వాస్తు శాస్త్రానికి నిదర్శనంగా నిలుస్తాయి. గోడలపై పుష్పాలు, లతలు, కుంభలతలు, ఆంధ్రుల, పల్లవ, చాళుక్య కాలానికి చెందినవి. ఆనాడే అత్యంత సూక్ష్మస్థాయిలోనే శిల్పాలను చెక్కిన తీరు మహాద్భుతం. మధుకేశ్వరాలయంలో లభించిన ప్రాచీన శాసనాలు వందకు పైగా ఉన్నాయి. అన్నీ నంది, నాగరిలిపికి చెందనవి. అనంతవర్మ చోడగాంగదేవుడు మధుకేశునికిచ్చినట్లు ఆ శాసనంలో ఉంది. శ్రీముఖలింగంలో మహాశివరాత్రి రోజున మూడు రోజుల పాటు యాత్ర నిర్వహిస్తారు.



శ్రీకూర్మం

శ్రీకాకుళం పట్టణానికి 15 కిలోమీటర్ల దూరంలో గార మండలంలోని శ్రీకూర్మంలో శ్రీకూర్మనాథుని ఆలయం ఉంది. కూర్మనాథుని దేవాలయం దేశంలో మరెక్కడా లేదు. ఎక్కడా లేని విధంగా రెండు ధ్వజస్తంభాలను కలిగి ఉండడం విశేషం. ఆలయాన్ని చైత్యశకం 453 సంవత్సరంలో స్థాపించినట్లు ఒక శిలాఫలకం లభించింది. దేవాలయ మండపంలో 24 నల్లరాతి ఏకశిలా స్తంభాలున్నాయి. ఏ ఒక్క స్తంభంతోనూ మరో స్తంభం పోలిక ఉండకపోవడం ఇక్కడ విశేషం. వీటిపై చెక్కిన శిల్పకళా సౌందర్యం చూసి తీరాల్సిందే. తూర్పు దిశనున్న స్తంభాలపై అశ్వరాయసింగారి శాసనం ఉంది. దీన్ని క్రీస్తుశకం 1727లో రాసినట్లు తెలుస్తోంది. ఆస్థాన మండపం ఎడమ పక్కన 'దేవరహస్యం' అని పిలువబడే భూగుహ ఉంది. దేవాలయ గోడలపై ఆకుపసర్లతో తీర్చిదిద్దిన కుడ్య చిత్రాలున్నాయి. ఇవి సుమారు 500 సంవత్సరాలు నాటివని చెప్తారు. ఇవి నేటికీ చెక్కుచెదరకుండా ఉండడం విశేషం.

జగతిమెట్టలో పురావస్తుశాఖ తవ్వకాల్లో బయల్పడ్డ బౌద్ధుల నివాసాలు



జగతిమెట్టలో ఆధారాలు


పోలాకి మండలం దుబ్బకవానిపేట సమీపంలోని జగతిమెట్ట వద్ద బౌద్ధమత ఆధారాలు లభించాయి. శాలిహుండం స్థావరంగా చేసుకుని కొందరు మత ప్రచారం కోసం జగతిమెట్టకు వెళ్ళారు. అక్కడ వంటలు చేసుకుని ఉండేవారని చెప్పారు. అప్పటి వంట గదులు నేటికీ ఉన్నాయి. వంటపాత్రలూ బయటపడ్డాయి. అప్పటి స్నానవాటికలు ప్రస్తుతం చెరువులుగా మిగిలాయి.

బౌద్ధ, జైన, శైవ మతాల సంగమం

శ్రీకాకుళానికి 13 కిలోమీటర్ల దూరంలో ఆమదాలవలస వద్ద ఉన్న సంగమేశ్వర ఆలయం బౌద్ధ, జైన, శైవ మతాల సంగమానికి గుర్తుగా నిలుస్తోంది. సంగమేశ్వర ఆలయం ఉన్న కొండను శిలాథ పర్వతమని పిలుస్తారు. ఆలయ ముఖద్వారం వద్ద ద్వారపాలకుల విగ్రహాలున్నాయి. కొండపై జైనుల విగ్రహాలు మరో రెండున్నాయి. సంక్రాంతి సమయంలో మూడు రోజుల పాటు ఇక్కడ జాతర నిర్వహిస్తారు.

పాండవుల మెట్ట

శ్రీకాకుళానికి 14 కిలోమీటర్ల దూరంలో ఆమదాలవలస వద్ద ఉన్న పాండవులమెట్టకు చారిత్రక ప్రాధాన్యత ఉంది. అలికాం-బత్తిలి రోడ్డును ఆనుకుని ఉన్న ఈ మెట్టపై జైన మత ఆనవాళ్లు ఉన్నాయి. క్రీస్తుపూర్వం 5, 4 శతాబ్దాల్లో జైన మతస్తులు ఇక్కడ జీవనం సాగించినట్లు తెలుస్తోంది. మెట్ట పైభాగంలో రాతిపరుపులు ఉన్నాయి. ఇంత పెద్ద రాతిపరుపులు ఇంగ్లాండ్ దేశంలో 'లవ్‌బరి' ప్రాంతంలో తప్ప మరెక్కడా లేవని పురావస్తు పరిశోధకులు చెప్తున్నారు. ఆ పరుపుల కింద క్రీస్తుపూర్వం నివాసమున్న ఆదివాసులు పూజించిన ప్రార్థనా మందిరాల ఆనవాళ్లు కూడా ఉన్నాయి.



ఒరిగిన వయోడక్ట్



సాగునీరు విడిచిపెట్టే సమయంలో లీకేజీ అవుతున్న వయోడక్ట్

- **లీకేజీలతో సాగునీరు వృథా**
- **నిర్మించిన నాటి నుంచి నేటివరకు మరమ్మతులు చేపట్టని అధికారులు**
- **మేల్కొనకపోతే ప్రమాదమే**

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న వయోడక్ట్ ఆసియా ఖండంలోనే అతిపెద్ద సాగునీటి కాలువను నిర్మించారు. ఈ వయోడాక్ట్ పంట పొలాలకు సాగునీరు అందించడంతో పాటు విహార యాత్రికలను సైతం ఆకట్టుకుంటుంది. రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉన్న ఈ సాగునీటి కాలువ రైల్వేట్రాక్ కింద నుంచి ఎటువంటి యంత్ర సహాయం లేకుండా దిగువ ప్రాంతం నుంచి ఎగువ ప్రాంతానికి సాగునీరు వెళ్తుంది. ఇటువంటి నిర్మాణాలు ఆసియా ఖండంలోనే పెద్దదిగా ఆమదాలవలసలో దివంగత సిఎం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి హయంలో ప్రారంభానికి నోచుకోవడం విశేషం. వంశధార కుడి కాలువకు అనుసంధానంగా ఈ వయోడాక్ట్ నిర్మాణం జరగడంతో వేలాది ఎకరాలకు సాగునీరు పుష్కలంగా అందు తుంది. ఎంతో గుర్తింపు పొందిన వయోడాక్ట్‌కు ప్రస్తుతం ప్రమాదం పొంచి ఉంది. నిర్మాణ లోపమో, అధికారుల శాపమో తెలియదు కానీ వయోడాక్ట్ ప్రమాదం బారిన పడింది. పట్టణానికి సమీపంలో ఉన్న వయోడాక్ట్ కుడి కాలువకు అను సంధానంగా పట్టణ శివారున కృష్ణపురంలో గల దాంద్రాసి మెట్ట నుంచి ఐదో వార్డు పరిధిలోని పంతులుపేట వరకు 2.2 కిలోమీటర్ల మేర నిర్మాణాలు జరిగాయి. గతంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పరిపాలనలో 2007 జూన్ నెలలో దీన్ని ప్రారంభించారు. ఈ కాలువ ద్వారా ఆమదాలవలస, శ్రీకాకుళం, గార మండలాలకు చెందిన సుమారు 36 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. వీటి నిర్మాణం కోసం అప్పట్లో రూ.16.05 కోట్లు వెచ్చించారు. అప్పటి నుంచి సాగునీరు అందిస్తున్న ఈ వయోడాక్ట్ మరమ్మతులకు నోచుకోకపోవడంతో ప్రమాదపు అంచుల్లో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీని నిర్వహణ చూసే వంశధార శాఖ అధికారులు పట్టించు కోకపోవడంతో ఈ దుస్థితి దాపురించింది. మూడు మండలాలకు తలమానికంగా ఉన్న వయోడాక్ట్ నిర్వహణను గాలికి వదిలేయడంతో భవిష్యతులో పంట పొలాలకు సాగునీరు అందడం ప్రశ్నార్థకంగా మారుతుందని చెప్పవచ్చు.

ప్రమాదం అంచున ట్రఫ్స్

వయోడాక్ట్ నిర్మాణంలో భాగంగా మూడు మండలాలకు సాగునీరు అందించడానికి 2.2 కిలోమీటర్ల మేర సిమెంట్ దిమ్మలు (కాంక్రీట్ పోల్స్) పైన ట్రఫ్స్ ఏర్పాటు చేశారు. ఈ ట్రఫ్స్ మీదుగా సాగునీరు దిగువ ప్రాంతాలకు వెళ్లే విధంగా ఏర్పాటు చేయడంతో ఖరీఫ్, రబీ సమయాల్లో రైతులకు సమయానికి సాగునీరు పుష్కలంగా అందుతుంది. ప్రస్తుతం ఈ ట్రఫ్స్ సిమెంట్ పోల్స్ మీద నుంచి పక్కకు ఒరగడంతో కూలిపోయే ప్రమాద స్థితికి చేరుకుంది. సిమెంట్ పోల్స్‌పై ఉండాల్సిన ట్రఫ్స్ 41 నుంచి 60 వరకు 80 నుంచి 87 వరకు పక్కకు జరిగిపోవడంతో ట్రఫ్ నుంచి ట్రఫ్ మధ్య ఖాళీ రావడంతో లీకులు ఏర్పడి సాగునీరు వృథాగా రోడ్లపై పడి ప్రవహిస్తుంది. లీకేజీ సాగునీరు వలన రోడ్డుపై ప్రయాణించే ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతుంది.

నిర్మాణంలో లోపాలు

వయోడాక్ట్ నిర్మించే సమయంలో అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా ఈ సమస్య ఏర్పడినట్లు ఇంజినీర్లు చెబుతుంటారు. 2.2 కిలోమీటర్లు మేర సిమెంట్ పోల్స్‌పై ట్రఫ్స్ ఏర్పాటు చేయడంలో రెండు మలుపులు ఉన్నాయి. ఈ మలుపులు వద్ద సాగునీటి ప్రవాహం తట్టుకునేందుకు సూపర్ వెలివేషన్ మార్గాన నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. సూపర్ వెలివేషన్ అనగా మలుపు ప్రాంతంలో కాస్త ఎత్తు దిగువగా ట్రఫ్స్ ఏర్పాటు చేయాలి. ఇలా చేయడం వలన సాగునీరు ప్రవహించే సమయంలో అతివేగాన్ని నిరోధించే శక్తి వస్తుంది. మలుపుల వద్ద సూపర్ వెలివేషన్ నిర్మాణాలు జరగకపోవడం వలన సాగునీటి ప్రవాహాన్ని నిరోధించలేక ట్రఫ్స్ పక్కకు ఒరిగిపోతున్నాయి.

ట్రఫ్స్ పక్కకు ఒరిగిపోవడం వలన ఆరేళ్ల క్రితం సిమెంట్ పోల్స్, ట్రఫ్స్‌కు మధ్య చిన్నపాటి సిమెంట్ దిమ్మలు పెట్టి నిలువరించారు. ప్రస్తుతం సిమెంట్ దిమ్మలు దాటి ట్రఫ్స్ ఒరిగి పోతు న్నాయి. దీనివలన పెను ప్రమాదమే సంభ వించవచ్చునని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాన్ని నివారించేందుకు సూపర్ వెలివేషన్ నిర్మాణాలు చేసి ట్రఫ్స్‌ను సరి చేయాల్సి ఉంది.



ట్రఫ్స్ ఒరిగిపోవడంతో అమర్చిన సిమెంట్ పలకలు



అధ్వానంగా ఉన్న అల్లెన-పనుకుపర్త

అధ్వాన రహదారితో అవస్థలు

ప్రజాశక్తి- బూర్జ

ప్రజా ప్రతినిధులు చేపట్టిన పనులు శాశ్వతమైన పనులు కాకపోవడంతో రోడ్లకు మోక్షం కలగడం లేదు. మండలంలోని అల్లెన ఆర్‌అండ్‌బి రోడ్డు నుంచి పనుకుపర్త వరకు తారు రోడ్డు నిర్మాణానికి అప్పటి టిడిపి హయాంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ రూ.70 లక్షల అంచనా వ్యయంతో పిఆర్ నిధులతో 2019 జనవరి 26న శంకుస్థాపన చేశారు. అయితే అప్పటికే తాత్కాలికమైన పనులు చేపట్టారు. అనంతరం ప్రభుత్వం మారడంతో రోడ్డు పనులకు బ్రేకులు పడ్డాయి. తరువాత ఆయా గ్రామస్తుల విజ్ఞప్తిల మేరకు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఉపాధి హామీ నిధులు రూ.30 లక్షల అంచనా వ్యయం 2021 మార్చి 21న శంకుస్థాపన చేశారు. అయితే అప్పట్లో నాశరకం పనులు చేపట్టడం వల్ల వరదలకు రోడ్డు కొట్టుకుపోయిందని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ నిధులు మంజూరు చేసి తాత్కాలిక పనులు చేపడుతున్నారు. ఇప్పటికైనా శాశ్వత రోడ్డును నిర్మించి, ఇరువైపులా వాల్స్ నిర్మించాలని కోరుతున్నారు.

ప్రజల నమ్మకంతో పెరిగిన బాధ్యత


గొండు శంకర్, ఎమ్మెల్యే శ్రీకాకుళం

- నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు
- ఒక్కొక్కటిగా వాటికి పరిష్కారం చూపుతా
- కోడిరామ్మూర్తి స్టేడియం పూర్తి చేస్తాం
- ఆమదాలవలస - శ్రీకాకుళం రోడ్డు పనులు వేగవంతం
- సాగునీటికి అత్యంత ప్రాధాన్యత
- నగర ప్రజలకు మౌలిక వసతుల కల్పన
- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోనే అత్యధిక మెజార్టీతో ప్రజలు ఎమ్మెల్యేగా గెలిపించారు. జిల్లా కేంద్రంలో ప్రజలు గడచిన ఐదేళ్లలో విసిగి వేశారిపోయారు. సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం ప్రజల మనసుల్లో ముద్రపడింది. అందువలనే ఎవరికి రానంత మెజార్టీ ఇచ్చి ఎన్నికల్లో తనను గెలిపించారు. ఈగెలుపు మరింత బాధ్యతను పెంచింది. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను గుర్తించాను. ఎన్నికల ముందు మూడేళ్ల పాటు ప్రజల్లో ఉండి వారి సమస్యలను దగ్గరగా చూశాను. వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తున్నాను. వాటిలో అత్యధికంగా రైతులకు శివారు ప్రాంత పంట పొలాలకు సైతం సాగునీరందించాలని ఈ ఏడాది ఖరీఫ్‌లో ఒక్క ఎకరం భూమి కూడా సాగునీరు లేక పంటలు ఎండి పోయాయన్న భావన రాకూడదని ఆలోచన చేశాను. ఎన్నికలు పూర్తవగానే ప్రజలకు ఇచ్చిన మొదటి హామీగా దీన్ని ఎంచుకున్నాను. రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో తనకున్న సాన్నిహిత్యాన్ని ఉపయోగించుకుని ఈ సమస్య అతని ముందుంచాను. సమస్య పరిష్కారానికి ఆయన మొట్టమొదట నిధులిచ్చి వంశధార కుడి కాల్వ మరమతు, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు చేపట్టేందుకు తోడ్పాటు అందించారు. ఈ నిధులతో అధికారుల సహకారంతో శతశాతం పనులు పూర్తి చేసి ఇప్పుడు సాగుకు నీటి కొరత లేకుండా చేశాను. రైతులు పూర్తి సంతృప్తితో ఉన్నారు. ఈ ఏడాది మారుమూల శివారు ప్రాంతాల్లో సైతం నాట్లు వేసుకున్నారు. చెరువుల్లో పూర్తి సామర్థ్యంతో నీటి నిల్వలు ఉన్నాయి. రైతుల కల నెరవేరింది. అలాగే నగరంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనంగా చెప్పుకునే కోడిరామ్మూర్తి స్టేడియం నిర్మాణం శరవేగంగా పూర్తి చేసేందుకు చర్యలు మొదలు పెట్టాం. ఈ పనులు పూర్తయితే క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ రాబోతోంది. స్టేడియం నిర్మాణంతో క్రీడా పోటీలకు జిల్లా వేదికగా నిలుస్తూ ఖ్యాతి తెస్తుంది. అందువలన దీనిని శరవేగంగా పూర్తి చేయనున్నాం. గ్యాలరీ నిర్మాణం పూర్తయితే పూర్తిస్థాయి క్రీడా సామర్థ్యం అందుబాటులోకి వస్తుంది. మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడిని తీర్చడానికి ప్రస్తుతం ఉన్న సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి జరుగుతోంది. కేంద్ర ప్రభుత్వంతో పాటు జల జీవన్ మిషన్ ప్రాజెక్టు ద్వారా స్వచ్ఛమైన నీటిని అందించేందుకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడి సహకారం కోరాను. అలాగే గ్రామాల్లో తాగునీటి సమస్యపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ మంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి నిధులు తీసుకురావడం జరుగుతుంది. యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సిల్క్ డెవలప్మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. యువతకు ఉపాధి కల్పించేందుకు వ్యవసాయ ఆధారిత చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వ సహకారంతో యువతకు మేలు చేకూరుతుంది. శ్రీకాకుళం - ఆమదాలవలస నియోజక వర్గాలను కలుపుతూ ఉన్న ప్రధాన రహదారి నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. గతంలో ఐదేళ్ల పాటు ఈరోడ్డు నిర్మాణం కోసం అనేక పోరాటాలు చేసి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చాం. ఈ రోడ్డు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఇప్పటికే రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ఈ రోడ్డు నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడడం జరిగింది. వర్షాలు కారణంగా పనుల్లో జాప్యం జరుగుతోంది. త్వరితగతిన పూర్తి చేస్తాం. వంశధార నదిపై సాలిహుండం వద్ద వంతెన అర్ధాంతరంగా గడచిన ఐదేళ్లుగా నిలిపి వేశారు. దీనికి సంబంధించి ఆరఅండ్‌బి అధికారులతో చర్చించి ప్రస్తుత పరిస్థితిపై సమీక్షించడం జరుగుతుంది. గతంలో టిడిపి ప్రభుత్వ హయాంలోనే ఈపనులు మొదలయ్యాయి. టిడిపి ప్రభుత్వం ఈ వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయడం జరుగుతుంది. అలాగే నగర పాలక సంస్థ పరిధిలో పెద్దఎత్తున కాల్వల్లో పూడికలను తొలగించడం జరిగింది. వర్షపు నీటిని రోడ్లపైకి రాకుండా ఉండేందుకు అధికారులతో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాను. గ్రామాల్లో ప్రజలకు ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించగలుగుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో పాటు ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి. అందుకు నిరంతరం ప్రజల మధ్యనే ఉంటే వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తున్నాం.

నిర్లక్ష్య ఫలితం... నీరందని వైనం


వెన్నెలవలస రిజర్వాయరు

- ఎండుతున్న జలాశయ ఆయకట్టు భూములు
- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలో తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావు సరుబుజ్జిలి, బూర్జ మండల రైతుల సాగునీటి కష్టాలు తీర్చడానికి వెన్నెలవలస, బొమ్మిక రిజర్వాయర్లు మంజూరు చేసారు. మెట్ట భూములకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన జలాశయాలు నాలుగున్నర ఏళ్లుగా అభివృద్ధికి నిధులు మంజూరు కాకపోవడంతో రైతులకు సాగునీరందని పరిస్థితి నెలకొంది. ఈ రెండు జలాశయాల కింద ఉన్న భూముల్లో సాగుచేస్తున్న వరి పంట ఎండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జలాశయాల్లో నీరు ఉన్నప్పటికీ తూముల ద్వారా పిల్ల కాలువలకు నీరు రాకపోవడంతో రైతులు ప్రతి ఏటా పంట పొలాలకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. బూర్జ మండల పరిధిలోని బొమ్మిక జలాశయం ఏళ్ల తరబడి అసంపూర్తిగా ఉంది. అలానే సరుబుజ్జిలి మండలం వెన్నెల వలస జలాశయంతో దీని పరిధిలోని గ్రామాల రైతులకు ఎటువంటి ప్రయోజనాలు దక్కడం లేదు.

నిరుపయోగంగా వెన్నెలవలస జలాశయం

సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస గిరిజన గ్రామం ఎగువ భాగంలో నిర్మించిన జలాశయం రైతులకు నిరాశనే మిగులుస్తోంది. ఐరోపా ఆర్థికసాయంతో 1987 ఆగస్టు 24న అప్పటి రాష్ట్రమంత్రి కెఇ కృష్ణమూర్తి ఈ జలాశయ నిర్మాణానికి శంకుస్థాపన చేసారు. ఏడు కిలోమీటర్ల దూరంలోని అటవీ ప్రాంతంలో కురిసిన వర్షపు నీటిని జలశయానికి మళ్ళించి సరుబుజ్జిలి మండలంలోని 12 గ్రామాలకు సాగునీరు అందించాలని అప్పటి ప్రభుత్వ ఉద్దేశం. వెన్నెలవలస శ్రీరామవలస మధ్య రెండు కొండల నడుమ నాలుగు వందల మీటర్ల గట్టు నిర్మించారు. జలాశయానికి ఇరువైపులా కుడి, ఎడమ కాలువలు నిర్మించి తూముల ఏర్పాటు చేసి 12 గ్రామాలకు చెందిన సుమారు 350 ఎకరాలకు సాగునీరు అందించడం జరిగింది. ప్రస్తుతం. జలాశయం గట్టు ముళ్లపొదలతో నిండిపోగా, పిల్ల కాలువ తూములు అధ్వాన స్థితికి చేరుకొని దిగువ భూములకు సాగునీరు అందడం లేదు. జలాశయం కింద భూముల్లో ఉన్న వరి పైరు ఎండి పోతున్నాయని వెన్నెలవలస, శ్రీరామువలస, మర్రిపాడు, బురిడివలస, చిగురు వలస, మూలసవలాపురం, సింధువాడ, సలంత్రి గ్రామాలకు చెందిన 255 మంది రైతులు ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

చుక్కనీరివ్వని బొమ్మిక

బూర్జ మండలం బొమ్మిక గిరిజన గ్రామం ఎగువ భాగంలో గజిలి గడ్డపై బొమ్మిక జలాశయం ఉంది. జలాశయం ద్వారా ఎనిమిది వందల ఎకరాల్లో 565 మంది రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించేందుకు రూ.130 లక్షల అంచనాతో 1988లో నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం జరిగింది.10 నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న అటవీ ప్రాంతంలో కురిసే వర్షపునీటిని జలాశయంలోకి మళ్లించి కొండపేట, మదనాపురం, పెద్ద పేట, జగన్నాధపురం, అప్పలపేట తదితర గ్రామాల్లోని పొలాలకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో అప్పట్లో ఈ రిజర్వాయర్ నిర్మించారు. జలాశయం మట్టికట్ట పొడవు 340 మీటర్ల వెడల్పు. 300 మీటర్ల పొల్లు కట్ట, పొడవు 34 మీటర్ల పరిధితో నిర్మించారు.


వృధాగా పోతున్న సాగునీరు

జలాశయానికి అమర్చిన రెండు మధుములు నాణ్యత దెబ్బ తినడంతో లీకులతో నీరు వృధాగా బయటకు పోతుంది. రిజర్వాయర్ పరిధిలో పంట పొలాలకు చుక్కనీరు అందని పరిస్థితి నెలకొంది. పాలకొండ నుంచి సరు బుజ్జిలి వచ్చే. దారి ఎడమవైపు ఉన్న రెండు జలాశయాలు పర్యాటకులు చూడడానికి తప్ప నాలుగున్నర ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో జలాశయాలు ఉపయోగపడితే ఒట్టు అంటూ రైతులు వాపోతున్నారు.


పాడైన తూములు

వెన్నెలవలస జలాశయ అధ్వాన స్థితిపై నీటిపారుదల శాఖ. జెఇ పి.రవి కుమార్ వద్ద ప్రస్తావించగా స్పీకర్ తమ్మినేని సీతారాం మరమ్మతులకు అంచనా వేయ మన్నారని, రూ.15 లక్షలతో నివేదికలు రూపొందించి పంపించడం జరిగిందని తెలిపారు.


పిచ్చి మొక్కలతో నిండిన బొమ్మిక రిజర్వాయర్

ఫార్మా కంపెనీల్లో భద్రత కరువు

జిల్లాలోని పలు ఫార్మా కంపెనీల్లో భద్రతా ప్రమాణాలు కొరవడ్డాయి. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఉద్యోగుల భద్రతపై కంపెనీల యాజమాన్యాలు శ్రద్ధ చూపక పోవడంతో ప్రాణ నష్టం జరుగుతోందన్న విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు జిల్లా యంత్రాంగం విచారణ కమిటీని ఏర్పాటు చేయడం, ఆ తరువాత కమిటీ బృందం ఇచ్చే నివేదిక వెలుగు చూడకపోవడం పరిపాటిగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి.



పైడిభీమవరం పారిశ్రామికవాడలో సంభవించిన ప్రమాదం (ఫైల్)

ప్రజాశక్తి - రణస్థలం

జిల్లాలోని రణస్థలం మండలంలోని పైడిభీమవరం పారిశ్రామిక వాడలో 30కి పైగా ఫార్మా, తదితర కంపెనీలు ఉన్నాయి. ఆయా కంపెనీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు వేలాది మంది పని చేస్తున్నారు. అయితే పలు కంపెనీలు భద్రతా ప్రమాణాలను పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు జరిగి కార్మికులు మృత్యువాత పడుతున్నారు. కొన్ని ఫార్మా కంపెనీల్లో రసాయనాలు లీకవ్వడం, గ్యాస్ రిఫైనరీల నుంచి మంటలు ఎగిసి పడడం, రసాయనాలు నిల్వ చేసే ట్యాంకర్లు, రియాక్టర్లు పేలిపోవడం వంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఆ సమయంలో వున్న ఉద్యోగులు, కార్మికులు అనేక మంది ప్రమాదాల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోతున్నారు. మరి కొందరు క్షతగాత్రులవుతున్నారు. చాలా కంపెనీల్లో ప్రమాదకరమైన కెమికల్స్ వినియోగిస్తుంటారు. అటువంటి కెమికల్స్ నిర్వహణ బాధ్యతలను తక్కువ ఖర్చుతో చేపట్టేందుకు పలు కంపెనీల యాజమాన్యాలు సబ్ కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారు. సబ్ కాంట్రాక్టర్లు కెమికల్స్ నిర్వహణ విషయంలో నైపుణ్యం కలిగిన ఉద్యోగులను నియమించుకోకపోవడం వలన తరచూ ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరుగుతున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి. నైపుణ్యం లేని ఉద్యోగుల నియామకాలు, రక్షణ చర్యలపై ఎవరైనా ప్రశ్నిస్తే యాజమాన్యాలు ఆ ఉద్యోగులను నిర్ధాక్షిణ్యంగా విధుల నుంచి తొలగిస్తున్నారు. దీంతో కార్మికులు, ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.

కార్మికుల భద్రతను గాలికొదిలేశారు



కార్మికుల భద్రతను గాలికొది లేస్తున్నారు. పరిశ్రమల వద్ద కనీస భద్రతా చర్యలు చేపట్టడం లేదు. ప్రమాదాలు జరిగి కార్మికుల ప్రాణాలు కోల్పోయే సమయంలో రేటు కట్టి చేతులు దులుపుకొంటున్నారు. కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. చనిపోతున్నా పరిహారం దక్కడం లేదు.

- పి.తేజేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి, సిఐటియు

ఆగని ప్రమాదాలు

జూన్ 29న పైడిభీమవరంలోని సరాక రసాయన పరిశ్రమలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. రియాక్టర్ పేలడంతో భారీగా మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో సమీపంలో కార్మికులు లేకపోవడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. కానీ భారీగా వాహనాలు కాలిపోయాయి. రూ.కోటిన్నర వరకూ నష్టం వాటిల్లింది.

ఇటీవల పైడిభీమవరం పారిశ్రామికవాడలోని శ్రేయస్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతి చెందారు. నిల్వల గోదాములపై రేకులు బిగిస్తుండగా.. ప్రమాదవశాత్తూ షమీర్‌షేక్ (23), రహిబుల్‌షేక్ (23) జారిపడ్డారు. షమీర్‌షేక్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రహిబుల్‌షేక్‌ను విజయ నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆయన చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. వీరిద్దరిదీ ఉత్తరప్రదేశ్. ఉపాధి కోసం ఇక్కడకు వచ్చి ఊహించని ప్రమాదంలో మృతి చెందడంతో కార్మికులు విషాదంలో మునిగిపోయారు. అలాగే పిషిని పంచాయతీ పరిధిలోని ఓ రసాయనిక పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో పి.త్రినాధరావు, కె.గోవింద రావుకు స్వల్ప గాయాలయ్యాయి. ఒక డ్రమ్‌లోని రసాయన పౌడర్ పేలడంతో దట్టమైన పొగలు కమ్ముకున్నాయి. దీంతో అక్కడ ఉన్న ఈ ఇద్దరు కార్మికుల కళ్లు ఎర్రబడి తీవ్ర ఇబ్బంది పడ్డారు. వీరిద్దరిని చికిత్స నిమిత్తం విజయనగరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎటువంటి ప్రమాదం లేదని తెలిపారు. అలాగే పైడిభీమవరం పారిశ్రామిక వాడలో ఇంతవరకూ జరిగిన ప్రమాదాల్లో సుమారు 30 మంది మృతి చెందడంతో పాటు వందలాది మంది కార్మికులు గాయాలతో బయట పడ్డారు.

తరచూ ప్రమాదాలు

పైడిభీమవరం పారిశ్రామిక వాడలో సుమారు 30 వరకూ పరిశ్రమలున్నాయి. వీటిలో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. స్థానికంగా సరైన వైద్య సదుపాయాలు కూడా లేవు. పైడిభీమవరంలో 2010లో కార్మికుల సౌకర్యార్థం ఇఎస్‌ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. కానీ వైద్యులు, సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించక పోవడంతో పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. పరిశ్రమల్లో ఏ ప్రమాదం జరిగినా మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను విజయ నగరం తరలిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 22,800 మంది కార్మికులు గుర్తింపు పొందారు. వారి మూలవేతనం నుంచి 1.75 శాతం ఇఎస్‌ఐకి వెళ్తుంది. యాజమాన్యాలు సైతం కొంత మొత్తాన్ని భరిస్తున్నాయి. అయితే ఇఎస్‌ఐ సేవలు మాత్రం అందుబాటులోకి రావడం లేదు. సకాలంలో అత్యవసర వైద్యం అందక చాలామంది మృత్యువాత పడుతున్నారు. అందుకే తక్షణం 100 పడకల ఇఎస్‌ఐ ఆస్పత్రితో పాటు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి తేవాలని కార్మికులు కోరుతున్నారు. కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మొక్కుబడి తనిఖీలు

ఫార్మా కంపెనీల్లో ఉద్యోగుల భద్రత, ప్రమాదాల నివారణకు ఏ విధమైన చర్యలు చేపడుతున్నారనే దానిపై విచారణ జరపాల్సిన అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేసి చేతులు దులిపేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫ్యాక్టరీల ఇన్‌స్పెక్టర్లు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, కార్మిక, అగ్నిమాపక శాఖల అధికారులు ఏడాదిలో కనీసం నాలుగు పర్యాయాలు తనిఖీలు చేసి పరిస్థితులను చక్కదిద్దే దిశగా కంపెనీల యాజమాన్యాలకు మార్గదర్శకాలు జారీ చేయాల్సి ఉన్నా ఆ విధంగా జరగడం లేదు. ఫార్మా కంపెనీల్లో కంట్రోల్ కాని రియాక్టర్లు ఉంటాయి. వాటిలో నిరంతరాయంగా హై టెంపరేచర్ ద్రవాలను మరిగిస్తూ ఉంటారు. ఈ క్రమంలో నిపుణులైన ఉద్యోగులు, కార్మికులు ఆయా రియాక్టర్లు పనిచేసే విభాగాల్లో అధిక ఉష్ణోగ్రత కారణంగా రియాక్టర్లు పేలిపోకుండా, ఇతరత్రా అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా పర్యవేక్షించాల్సి వుంటుంది. కానీ ఫార్మా కంపెనీల్లో నిపుణులైన ఉద్యోగులు లేకపోవడం వల్లే తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫార్మా కంపెనీల్లో రియాక్టర్లు పేలడం, పైపులైన్ లీకేజీల కారణంగా తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. వ్యర్థ రసాయనాలు ప్రవహించే పైపులైన్‌లు సక్రమంగా ఉన్నాయా?, లేదా? అనేది తరచూ పర్యవేక్షించాలి. వ్యర్థ రసాయనాలు శుద్ధి చేసిన తరువాతే బయటకు పంపాల్సి ఉన్నా ఆ విధమైన చర్యలు చేపట్టక పోవడం వలన ప్రమాదాలు జరగుతున్నాయని తెలుస్తోంది. అత్యధిక శాతం మంది నిపుణులైన ఉద్యోగులు లేని కారణంగా తరచూ జరుగుతున్నా ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టలేక పోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఫార్మా కంపెనీల్లో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కార్మికశాఖ పట్టించుకోవాలి



జిల్లాలో కార్మికశాఖ ప్రేక్షక పాత్రకే పరిమితమవుతోంది. పరిశ్రమలు మూతపడుతున్నా పట్టించుకోవడం లేదు. కార్మిక చట్టాలను అమలు చేయకపోయినా చర్యలు తీసుకోవడం లేదు. కనీసం పరిశ్రమల్లో భద్రతా చర్యలు ఎలా ఉన్నాయో తనిఖీ చేసేందుకు కూడా ముందుకు రాకపోవడం దారుణం. ఇప్పటికైనా దృష్టిపెట్టాలి.

- సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా అధ్యక్షులు, సిఐటియు



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



పెద్దపేట విత్తనాభివృద్ధి క్షేత్రం

నాడు ఘనం.. నేడు శిథిలం

- విత్తనాభివృద్ధి క్షేత్రానికి గ్రహణం వీడేదెప్పుడో?
- చోద్యం చూస్తున్న పాలకులు, అధికారులు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని పెద్దపేట ఉన్న వ్యవసాయ విత్తన అభివృద్ధి క్షేత్రానికి గ్రహణం పట్టింది. ఈ క్షేత్రానికి ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంది. గతంలో విత్తనాభివృద్ధి క్షేత్రం నుంచే జిల్లాలోని అన్ని మండలాలు, విజయనగరం, విశాఖ పట్నం, తూర్పుగోదావరి జిల్లాలకు విత్తనాలు సరఫరా అవుతుండేవి. అంతేకాకుండా వంద నాలు మంది కూలీలకూ ఉపాధి లభించేంది. ఇది నాడు ఘనం... నేడు విత్తనాభివృద్ధి క్షేత్రం మూలకు చేరింది. 15 ఏళ్లగా పాలకులు, అధికారులు దీనిపై కన్నెత్తిచూడకపోవడంతో నేడు నిరుపయో గంగా మారి శిథిలావస్థ స్థితిలో దర్శన మిస్తుంది. అధికారులు లెక్కల ప్రకారం 108 ఎకరాల్లో టన్నుల వరకు దిగుబడి వచ్చేది. గతంలో ఈ క్షేత్రంలో వరి, పెసర, మినుములు, రాగులు, నువ్వులు, జనుము పంటలతో పచ్చగా కళకళాడుతూ కనిపించేది. ప్రస్తుతం ఈ ప్రాంతమంతా ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు డొంకలతో నిండిఉంది. ఈ ప్రాంతానికి సాగునీరు అందించే పిల్ల కాలువలు పుడుకులతో నిండి కప్పబడింది. ఉన్న నేలబావులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని రూపురేఖలు మారి పోయాయి. అలాగే విత్తన శుద్ధి చేసే యంత్రాలను భద్రపరిచేందుకు చోటు లేకపోవడంతో దగ్గర పరిసర ప్రాంతాల్లో విడిచిపెట్టడంతో అవి నేడు పూర్తిగా తుప్పు పట్టి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. గతంలో ఈ క్షేత్రంలో ఎఒ, ముగ్గురు వ్యాచ్‌మెన్లు, సహాయకులు ఉండేవారు. ప్రస్తుతం ఒక్క వ్యాచ్‌మెన్ మాత్రమే ఉన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు సరఫరా చేసే అభివృద్ధి క్షేత్రం నేడు నిరుపయోగంగా మారింది. మళ్లీ అభివృద్ధిలోకి తీసుకొస్తే ఎంతో బాగుంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. పేదలకు ఉపాధి కల్పనతో పాటు రైతులకూ మేలు చేకూరుతుంది.



శిథిలమైన భవనాలు

కనువిందు

కనువిందు చేసే ఎత్తయిన కొండలు. జలజలమని జాలు వారే సెలయేరు... చుట్టూ పచ్చని పైరుహోరు... గాలులు, పక్షుల కీలకల రావాలు... ఇవన్నీ వింటే ఊటీ, కొడైకెనాల్, అరుకు తదితర ప్రాంతాలు మనకు టక్కున గుర్తొస్తాయి. అయితే మంలంలోని ప్రకృతి ప్రసాదించిన ఓ జలపాతం ఇటీవల వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి...

ప్రజాశక్తి- బూర్జ

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట, జిల్లాలోని మెళియాపుట్టి మండలం ఒడిశా సరిహద్దు ప్రాంతం ఇప్పటికే ప్రకృతి ప్రేమికులకు ఆకట్టుకున్నాయి. పర్యాటక కేంద్రంగా కూడా ఎంతగానో అభివృద్ధి చెందాయి. ప్రస్తుతం బూర్జ మండలం లక్కుపురం పరిధిలోని కొత్తవలస గిరిజన గ్రామం నేడు ప్రకృతి ప్రేమికులకు ఎంతగానో



ఆకర్షితమవుతుంది. అందుకు కారణం ఈ ప్రాంతంలో ఈ ప్రకృతి సిద్ధమైన అందాలు దర్శనమిస్తుంది. ఇంతవరకు ఈ ప్రాంతంలో మినీ రిజర్వాయరు ఉందన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే అక్కడి నుంచి కిలోమీటర్ దూరం వెళ్తే కొన్ని విందు చేసే అందాలు కనిపిస్తున్నాయి. దీనిని ప్రకృతి ప్రేమికులు గుర్తించడంతో పర్యాటకుల తాకిడి ఎక్కువైంది. ప్రభుత్వం స్పందించి ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తే... ఆదాయంతో పాటు ఈ ప్రాంతం గుర్తింపు కూడా వస్తుంది. ముఖ్యంగా ఈ ప్రాంతంలో కొండ కోనల నుంచి జారు వారుతున్న జలపాతం, చుట్టూ ప్రకృతి సోయగాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. అలాగే దగ్గరలో కోనేరు ఉంది. ఇక్కడా కూడా పార్కుగా ఏర్పాటు చేస్తే ఆదాయ వనరులు చేకూర్చవచ్చునని ప్రకృతి ప్రేమికులు అంటున్నారు.

ఇలా వెళ్లాలి....

మండలంలోని లక్కుపురం కూడలి వద్ద



ముక్కిడి పోలమ్మ ఆలయం నుంచి పాలకొండ-శ్రీకాకుళం సిఎస్‌పి రహదారిని ఆనుకుని రెండు కిలోమీటర్లు కొత్తవలస వెళ్లాలి. గ్రామ సమీపంలో మినీ రిజర్వాయరు ఉంది. అక్కడి నుంచి మరో కిలోమీటర్ దూరం వెళ్తే... ఈ ప్రాంతానికి చేరుకోవచ్చు. పైన చెప్పిన ప్రకృతి అందాలను ఆహ్వాదించవచ్చు.